PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 183 | విజయవాడ, శనివారం 4 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 4 February 2023 | Rs

హైడ్రో ప్రాజెక్టులపై ఉద్యమం ఉధృతం

- ఎర్రవరం బహిరంగ సభలో పి మధు

లోపలి పేజీలో..



గన్నవరం వద్ద సాబ్జీని అరెస్టు చేస్తున్న పోలీసులు

చర్చించాల్సిందే!

అదాని వ్యవహారంపై ప్రతిపక్షాల పట్టు

రెండవరోజూ పార్లమెంటులో ప్రతిష్టంభన • సోమవారానికి వాయిదా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదాని గ్రూపు అక్రమాల వ్యవహారం వరుసగా రెండవరోజూ పార్లమెంటును కుదిపేసింది. ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఈ వ్యవహారంపై చర్చించాలని పట్టుబట్టారు. ఎల్ఐసి, ఎస్‌బిఐతో పాటు, ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులకు జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వం తిరస్కరించడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే అదానీ గ్రూప్ పై హిండెన్బర్గ్ ఇచ్చిన నివేదికపై దర్యాప్తు చేపట్టాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటి (జెపిసి) చేతగానీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కమిటీతో గానీ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశాయి. వారి అభ్యర్థనలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిరాకరించారు. సభ్యులు నిరాధారమైన ఆరోపణలు చేయకూడదన్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు ఆందోళనకు దిగారు. నినాదాలు హోరెత్తించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. దీంతో సభ ప్రారంభమైన ఆరు నిమిషాలకే వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా అదే పరిస్థితి నెలకొంది. దీంతో మరోసారి సభ ప్రారంభమైన ఏడు నిమిషాలకే సోమవారానికి వాయిదా పడింది. మరోవైపు రాజ్యసభ ఛైర్మన్ కూడా ప్రతిపక్షాల వాయిదా తీర్మానాలను తోసిపుచ్చారు. దాంతో ప్రతిపక్ష నేతలు నినాదాలు హోరెత్తించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య రాజ్యసభ మధ్యాహ్నం 2.30 గంటల వరకు వాయిదా పడింది. తరువాత మళ్లీ కార్యాకలాపాలు ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాల నుంచి అదే డిమాండ్ వినిపించింది. దాంతో ఎలాంటి చర్చ లేకుండానే రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది.

16 ప్రతిపక్ష పార్టీలు నేతలు భేటీ

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు 16 ప్రతిపక్ష పార్టీలు నేతలు భేటీ అయ్యారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, సిపిఐ, ఎస్పి, ఆప్, బిఆర్ఎస్, శివసేన, ఆర్జేడి, జెడియు, ఎన్సిపి, నేషనల్ కాన్ఫరెన్స్, ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్పిల తదితర పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఐదేళ్లలో 28,572 మంది రైతుల ఆత్మహత్య

- ఎపిలో 3,185 మంది చిన్నారులు అదృశ్యం
- పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్ర మంత్రులు

లోపలి పేజీలో..

సిపిఎస్ ఆందోళనపై నిర్బంధం

యుటిఎఫ్ 'సంకల్ప దీక్ష'ను అడ్డుకున్న ప్రభుత్వం

వందలాది మంది అరెస్టు • నిరసనగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ దీక్ష

మద్దతు తెలిపిన సిపిఎం, సిపిఐ • 5న జిల్లా కేంద్రాల్లో దీక్షలు : యుటిఎఫ్ పిలుపు



యుటిఎఫ్ కార్యాలయ ఆవరణలో దీక్ష చేపట్టిన పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, గన్నవరం

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) రద్దు కోరుతూ ఉపాధ్యాయులు ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం మరోమారు నిర్బంధాన్ని ప్రయోగించింది. యుటిఎఫ్ తలపెట్టిన సంకల్పదీక్షను అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు వందలాది మంది ఉపాధ్యాయులను అరెస్ట్ చేశారు. కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, వీరవల్లి, ఆతుకూరు, హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్లు ఉపాధ్యాయులతో నిండిపోయాయి. ఈ నిర్బంధ కాండకు నిరసనగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు వి. బాలసుబ్రమణ్యం, కె.ఎస్ లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి యుటిఎఫ్ కార్యాలయంలోనే దీక్ష ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు ఈ దీక్ష సాగింది. దీంతో యుటిఎఫ్ కార్యాలయం వద్ద కూడా పెద్ద సంఖ్యలో పోలీసులు మొహరించారు. ఎంఎల్‌సిల దీక్షకు సిపిఎం, సిపిఐలు మద్దతు ప్రకటించాయి. ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు వి. శ్రీనివాసరావు, కె. రామకృష్ణ యుటిఎఫ్ కార్యాలయానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఎపి ఎన్‌జిఓ సంఘం కూడా మద్దతు తెలిపింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 5న జిల్లా కేంద్రాల్లో సంకల్ప దీక్షలు నిర్వహించాలని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు.

గురువారం నుండే అరెస్టులు

రహదారులపై సభలు, సమావేశాలు రద్దు చేస్తూ జారీ చేసిన జిఓనెం.1 అమలులో ఉన్న నేపథ్యంలో విజయవాడ నగరానికి దూరంగా కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో చిన్న అవుటపల్లి పరిధిలోని సుందరయ్య విద్యానగరంలో ఒక ప్రైవేటు స్థలంలో యుటిఎఫ్ నిర్వహించ తలపెట్టిన సంకల్ప దీక్ష కార్యక్రమానికి కూడా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పైగా ఈ కార్యక్రమానికి వచ్చే ఉపాధ్యాయులను గురువారం నుండే అరెస్ట్ చేయడం ప్రారంభించింది. పోలీసు ఆటంకాలను దాటుకుని గన్నవరం పరిసర ప్రాంతాలకు చేరుకున్న వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాలూ, విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాల వైపు నుంచి వస్తున్న వారిని టోల్‌గేట్ వద్ద, విజయవాడ, గుంటూరు, ఇతర ప్రాంతాల వైపు నుంచి వస్తున్న వారిని గన్నవరంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఉపాధ్యాయులను చుట్టుముట్టి బలవంతంగా ఈడ్చి పడేశారు. ప్రైవేట్ బస్సుల్లో హనుమాన్ జంక్షన్, ఉంగుటూరు, కంకిపాడు పోలీస్ స్టేషన్లకు తరలించారు. పెద్దఅవుటపల్లి వద్ద దశల వారీగా వచ్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, కార్యదర్శులు ఎస్‌పి మనోహర్, సుందరయ్య, ఎ కృష్ణ, కోశాధికారి బి.గోపిమూర్తి

మిగతా 5లో

భారత్ కంటి చుక్కల మందుతో అమెరికాలో ఒకరు మృతి

- ఐదుగురికి చూపు గల్లంతు

వాషింగ్టన్ : భారత్‌కు చెందిన గ్లోబల్ ఫార్మా హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్ తయారు చేసిన ఎజ్రీకేర్ కంటి చుక్కల మందు కారణంగా అమెరికాలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు కంటి చూపు కోల్పోయారు. పలువురికి కంటి చూపు మందగించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ఈ మందుపై ఆంక్షలు విధించింది. అమెరికా మార్కెట్ నుంచి ఈ మందును రీకాల్ చేసుకుంటున్నట్లు భారత కంపెనీ వెల్లడించింది. ఎజ్రీకేర్ కంటి చుక్కల మందు కారణంగా 12 రాష్ట్రాల్లో కనీసం 55 మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారని అమెరికా అధికారులు ఇటీవల తమ ప్రజలను హెచ్చరించారు. ఇందులో ఒకరు ఇన్ఫెక్షన్ కారణంగా మరణించారని, మరో ఐదుగురికి కంటిచూపు పోయిందని అమెరికా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధికార ప్రతినిధి చెప్పారు. 'న్యూయార్క్, వాషింగ్టన్‌తోపాటు మరో 10రాష్ట్రాల్లో పలువురు కంటి చుక్కలు వేసుకున్న తర్వాత బ్యాక్టీరియా వ్యాప్తి చెంది ఊపిరితిత్తులు, రక్తం, మూత్రంలో ఇన్ఫెక్షన్ కనిపించింది' అని సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో ఎజ్రికేర్, డెల్సామ్ కంటి చుక్కల కొనుగోళ్లు, వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తమ వైద్యులు, వినియోగదారులను హెచ్చరించింది.

విశ్వనాథ్‌కు కన్నీటి వీడ్కోలు

పంజాగుట్ట స్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ (92)కు కుటుంబ సభ్యులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని పంజాగుట్ట స్మశానవాటికలో విశ్వనాథ్ పెద్ద కుమారుడు నరేంద్ర అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సాంప్రదాయం ప్రకారం విశ్వనాథ్‌ను ఖననం చేశారు. దీనికి ముందు అభిమానుల సందర్శనార్థ విశ్వనాథ్ పార్థివదేహాన్ని ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసంలో మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంచారు. సినీ దర్శకులు కె. రాఘవేంద్రరావు, రాజమౌళి, నటులు చిరంజీవి, వెంకటేశ్, పవన్‌కల్యాణ్, సీనియర్ నటులు చంద్రమోహన్, మురళీమోహన్, కోట శ్రీనివాసరావు, నాగబాబు, ఆర్ నారాయణమూర్తి, నిర్మాతలు అల్లు అరవింద్, డి సురేష్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కీరవాణి, చంద్రబోస్ తదితరులు విశ్వనాథ్‌కు నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఇంటి వద్ద నుంచి పంజాగుట్ట స్మశానవాటిక వరకు అంతిమయాత్ర జరిగింది. అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విశ్వనాథ్‌కు కన్నీటి వీడ్కోలు పలుకుతున్న అభిమానులు

గవర్నర్, సిఎం ప్రభృతుల సంతాపం

కె.విశ్వనాథ్ మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి కెసిఆర్ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అంతర రాష్ట్ర వివాదాలు పెంచే బిజెపి కుట్ర

తుంగభద్ర ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడాలి

ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


కేంద్ర బడ్జెట్‌లో అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రు.5,300 కోట్లు కేటాయించడం ద్వారా అంతర రాష్ట్ర వివాదాలను సృష్టించి రాజకీయంగా లబ్ది పొందాలనే కుట్రపూరిత వైఖరిని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో అప్పర్ భద్రకు కేటాయింపులు ప్రకటించిన అనంతరం కృష్ణా, తుంగభద్ర ఆయకట్టులోని ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు నీటి లభ్యత విషయమై ప్రజల్లో పలు సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికే తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువ, ఆర్‌డిఎస్ఎస్, కెసి కెనాల్ ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోవడం, కాలువ చివర ప్రాంతాలు బీడుగా మిగిలిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కరువు పీడిత రాయలసీమ ప్రజానీకం కేంద్ర ప్రభుత్వ ప్రకటన పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలు సైతం కేంద్రం పట్టించుకోకుండా కర్నాటక ఎన్నికల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దెబ్బతీయడం గర్హనీయమని తెలిపారు. నదీ జలాల ట్రిబ్యునళ్లు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు కేటాయించిన నీళ్లు గ్యారెంటీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడానికి తగు చర్యలు తక్షణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది.

జగనన్నకు చెబుదాం...!

- వినతుల కోసం ప్రభుత్వ కొత్త కార్యక్రమం
- సిద్ధం కావాలని సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి అందే వినతులను సంతృప్తిస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం..' అనే కొత్త కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు, ప్రజలనుండి వచ్చే వినతులను శాఖల వారిగా విభజించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి వినతిని ట్రాకింగ్ చేస్తూ పరిష్కారం అయ్యేలా వారంవారం ఆడిట్ చేయాలని సూచించారు. ఫిర్యాదుల కోసం ఇప్పటికే వున్న స్పందన కాల్‌సెంటర్లను 'జగనన్నకు చెబుదాం' తో అనుసంధించాలని అన్నారు. సిఎంఓతో పాటు ప్రతి శాఖలోనూ ఈ కార్యక్రమానికి సంబంధించిన మానటరింగ్ సెల్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఇపుడున్న స్పందన ప్రకారం ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, హోంశాఖ, ఆరోగ్యశాఖలనుండి వస్తున్నాయని తెలిపారు. జగనన్నకు చెబుదాంలో కూడా ఈశాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువ వచ్చే అవకాశం వుందని అన్నారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిష్కారం కానివి వుంటే అర్జీదారుడు తన సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేసిందనే సంతృప్తి వుండేలా వ్యవహరించాలన్నారు. పోలీసులకు వచ్చే వినతులపై మండల స్థాయిలో ఒక సమన్వయ కమిటిని ఏర్పాటు చేయాలన్నారు. వినతులను పరిష్కరించే అంశంలో అంతా అప్రమత్తంగా వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, స్పెషల్ సిఎస్‌లు వై శ్రీలక్ష్మి (మున్సిపల్), బి రాజశేఖర్(పంచాయతీరాజ్), వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎంటి కృష్ణబాబు, హోమ్‌శాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, సెర్ప్ సిఇఓ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిబిసి డాక్యుమెంటరీ నిషేధంపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : గుజరాత్‌లో 2002 మారణహోమానికి సంబంధించి బిబిసి రూపొందించిన "ఇండియా : ది మోడీ క్వశ్చన్" డాక్యుమెంటరీపై నిషేధాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రానికి నోటీసులిచ్చింది. డాక్యుమెంటరీ ప్రసారం నిలిపివేతపై ఒరిజినల్ రికార్డులను సమర్పించాలని, మూడు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ తర్వాత రెండు వారాల్లోగా రిజాయిండర్ చేయాలని ఆదేశించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్, 2021 కింద అత్యవసర నిబంధనలను ఉపయోగించి యూట్యూబ్, ట్విట్టర్ తదితర సంస్థలను ఆ డాక్యుమెంటరీ లింక్‌లను బ్లాక్ చేయాలని గతనెల 21న కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు, వాటిని చూసే వారిని అరెస్టు చేయడం భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని పేర్కొంటూ సీనియర్ జర్నలిస్ట్ ఎన్.రామ్, ప్రశాంత్ భూషణ్, టిఎంసి ఎంపి మహువా మొయిత్రా, న్యాయవాది ఎంఎల్ శర్మ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కేసు విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

కోర్టు ఉత్తర్వులంటే మీకు లెక్క లేదా?


- ఐఎఎస్ అధికారులను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ఉత్తర్వులంటే లెక్క లేదా? అని ఐఎఎస్ అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల బిల్లుల చెల్లింపు కేసు విచారణ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేసింది. 70 కోర్టు ధిక్కరణ కేసుల్లో ఐఎఎస్ అధికారులు జికె ద్వివేది, ఎస్ఎస్ రావత్ శుక్రవారం హైకోర్టు విచారణకు హాజరయ్యారు. కోర్టు విచారణకు హాజరై సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని వారిని హైకోర్టు ప్రశ్నించింది. అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేసింది. మన హైకోర్టులోనే కోర్టు ధిక్కరణ కేసులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. కేవలం అధికారుల తీరు వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడింది. ఐఎఎస్ అధికారులు భ్రమల్లో ఉండొద్దని హెచ్చరించింది. కోర్టు ఆదేశిస్తే అమలు చేయకపోయినా ఏం కాదనే మితిమీరిన ధోరణి ఉంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తేల్చి చెప్పింది. ఏమవుతుందిలే అని బరితెగింపు ఉంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులు క్షమాపణలు చెబితే సరిపోదని, కోర్టు ఉత్తర్వులను అమలు చేసితీరాలని తేల్చి చెప్పింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



అమెరికన్ డోజోన్స్ నుంచి అదాని ఔట్..



న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రిపోర్ట్ ఆధారంగా అదాని గ్రూపునకు అంతర్జాతీయ సంస్థలు ఒక్కొక్కటిగా వరుస కట్టి షాక్ ఇస్తున్నాయి. ఇప్పటికే పలు బ్యాంక్‌లు అదాని కంపెనీలకు బాండ్లపై రుణాల జారీని నిరాకరించగా.. తాజాగా శుక్రవారం అమెరికన్ సంస్థ ఎస్అండ్‌పి డోజోన్స్ తన సస్టెయిని బిలిటీ సూచీ నుంచి అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఫిబ్రవరి 7 నుంచి ఇది అమల్లోకి వచ్చేలా సవరణలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. స్టాక్ మార్కెట్‌లో మానిప్యులేషన్, అకౌంటింగ్ మోసాలు, వాటాదారుల విశ్లేషణలు, మీడియా రిపోర్టులు, పలు విశ్లేషణలను ఆధారంగా చేసుకుని అదాని ఎంటర్‌ప్రైజెస్‌ను సస్టెయినిబిలిటీ సూచీ నుంచి తొలగిస్తున్నట్లు డిజోన్స్ తన నోట్‌లో పేర్కొంది. ఒక కంపెనీ సామాజిక, ఆర్థిక ప్రగతి ఆధారంగా ఈ సూచీలో గుర్తింపును ఇస్తుంది. ఈ సూచీలో ప్రపంచంలోని అతిపెద్ద 2500 స్టాక్స్‌కు మాత్రమే గుర్తింపు ఉంటుంది. ఇప్పటికే అదాని కంపెనీల షేర్లు అగాథంలో పడిపోతుండగా.. డోజోన్స్ నిర్ణయం ఆ కంపెనీ షేర్లను మరింత తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. దీంతో అదాని ప్రపంచ కుబేరుల జాబితాలో 21వ స్థానానికి పతనమయ్యారు.

కళాతపస్వి విశ్వనాథ్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సినీ దర్శకుడు కె విశ్వనాథ్ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. స్టూడియోలో సౌండ్ రికార్డు ఆర్టిస్టుగా సినీ జీవితం ప్రారంభించిన ఆయన దర్శకుడిగా సామాజిక సంస్కరణల ఆవశ్యకతపై అనేక మంచి చిత్రాలు అందించారని పేర్కొన్నారు. విశ్వనాథ్ చిత్రాల్లో తెలుగు సంస్కృతి ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

వాయిదాల పద్ధతిలో అమరావతి బిల్లులు

- ప్రభుత్వ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమరావతి రాజధాని నిర్మాణంలో పెండింగ్ బిల్లులను వాయిదాల పద్ధతిలో చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆర్థికశాఖలో కసరత్తు జరుగుతోంది. రాజధాని పనుల్లో గ్రీనరీకి సంబంధించిన సంస్థలతోపాటు, మొక్కలు సరఫరా చేసిన, పలు రోడ్లు పనులు చేసిన సంస్థలు, విద్యుత్ పనులు చేసిన వారు తమకు రావాల్సిన నిధుల బకాయిలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పనులకు సంబంధించి అమరావతి అభివృద్ధి సంస్థ నుంచి బిల్లులు సిద్ధమైనప్పటికీ అవి ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇలా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆరు కేటగిరీలుగా విభజించినట్లు తెలిసింది. సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయి కూడా విడుదల కానివి, ఇంకా సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ కానివి, నిధుల లేమి కారణంగా బిల్లులు ఇవ్వలేనివిగా గుర్తించినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే న్యాయస్థానం కూడా జోక్యంచేసుకుని బిల్లులపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండడంతో అధికారులు చెల్లింపులపై తర్జనభర్జన పడుతున్నారు. దీంతో విడతల వారీగా చెల్లించాలన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఈ మేరకు కోర్టుకు కూడా నివేదిక సమర్పించనున్నారని సమాచారం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పోస్టుల్లో ఇన్‌ఛార్జులు వద్దు

- అవసరమైతే తాత్కాలిక పదోన్నతులు
- క్షేత్రస్థాయి పోస్టులపై సిఎం ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అనేక కీలక పోస్టులను ఇన్‌ఛార్జులతో కొసాగించే విధానం వద్దని ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణమే ఇన్‌ఛార్జులుగా ఉన్న పోస్టుల్లో పూర్తి స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అసవరమైతే దిగువ స్థాయి వారికి తాత్కాలిక (అడ్‌హాక్) పదోన్నతులు కల్పించి ఇన్‌ఛార్జులు ఉన్నచోట నియమించాలని సిఎం తరపున ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది.

ప్రధానంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఇన్‌ఛార్జి వ్యవస్థల వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. పలు కోర్టు కేసుల సమయంలో ఇన్‌ఛార్జుల వల్ల ఫైళ్లు ముందుకు సాగడం లేదని స్పష్టం చేసింది. అందుకే ఇన్‌ఛార్జులు, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వారి స్థానంలో రెగ్యు లర్ అధికారులను నియమించాలని నిర్దేశించింది. దీనిపై ఆయా శాఖల కార్యద ర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

భూపోరాట నేతల అరెస్టు

ప్రజాశక్తి-అద్దంకి, భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం, చింతల్లంకలో దళితుల భూపోరాటానికి నాయకత్వం వహించిన కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు తోడేటి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినందుకు ఇప్పటికే మూడు సార్లు నోటీసులిచ్చామని, అయినా మళ్లీ భూమిలోకి ప్రవేశించడంతో అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు. భూపోరాటానికి నాయకత్వం వహించిన నాయకులను అరెస్టు చేయడం అక్రమమని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఒక ప్రకటనలో ఖండించారు. దళితులపై దాడి చేసిన పెత్తందారులను, అధికార పార్టీ నాయకులను సంతృప్తిపరచడానికి తోడేటి సురేష్‌ను అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని, దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆర్‌సి భూములను పేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

హైడ్రో ప్రాజెక్టులపై ఉద్యమం ఉధృతం

- ఎర్రవరం బహిరంగ సభలో పి మధు



ఎర్రవరంలో నిర్వహించిన ర్యాలీలో మధు, అప్పలనర్స, గిరిజనులు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనులకు తీవ్ర నష్టం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టుల ప్రతిపాదనలను విరమించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యులు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల వ్యతిరేకోద్యమ బహిరంగ సభ చింతపల్లి మండలం ఎర్రవరం గ్రామంలో ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం జరిగింది. ఆ ప్రాంతంలోని పలు గ్రామాల గిరిజనులు తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మధు పాల్గొన్నారు. పార్టీలకతీతంగా కదిలివచ్చిన వైసిపి, టిడిపి, సిపిఎం, సిపిఐ ప్రజాప్రతినిధులు, పలు ప్రజాసంఘాల నాయకులతో ఆయన మాట్లాడారు. ముక్తకంఠంతో అందరూ ఒక్కటిగా నిలవడం హైడ్రో వ్యతిరేక ఉద్యమం నైతిక విజయమని ఈ సందర్భంగా మధు వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అటవీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గిరిజన చట్టాలకు విరుద్ధంగా అదానీకి, ప్రయివేట్ సంస్థలకు అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

దేశంలోని ప్రజల సకల సంపదలనూ అదానీకి కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. విశాఖలోని గంగవరం పోర్టును అదానీ ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. విమానయానాన్ని, అడవులను, సముద్రాన్ని అదానీకి పాలకులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు కింద రెండు డ్యాములు కట్టబోతున్నారని, దీనివల్ల 15 వేల ఎకరాల భూములు, 21 గ్రామాలు ముంపునకు గురవుతాయని, సుమారు వంద గ్రామాల్లో 1500 గిరిజన కుటుంబాల జీవనాధారానికి ముప్పు వాటిల్లనుందని తెలిపారు. నాడు బాక్సైట్ జోలికొస్తే గిరిజనులు పాలకులను ఎలా తరిమికొట్టారో సిఎం జగన్మోహన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, జిల్లా నాయకులు బోనంగి చిన్నయ్య పడాల్, వైసిపి, సిపిఐ, టిడిపి స్థానిక ప్రజాప్రతినిధులు ఉల్లి సత్యనారాయణ, ఎస్.సోమరాజు వరలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిపై మోసపూరిత ప్రకటనలు

అమరావతిని అభివృద్ధి చేయలేక, తాజాగా విశాఖ రాజధాని అని, అక్కడే తాను కూడా మకాం పెడతానని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటిస్తున్నారని మధు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రజలను మభ్య పెట్టకుండా మూడు రాజధానులకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు.

మాకు న్యాయం చేయండి

- జిల్లా కలెక్టరు, ఎస్‌పి వద్ద మిర్చి రైతుల మొర

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో మిర్చి వ్యాపారి నరేంద్రను కిడ్నాప్ చేసిన కేసులో మరో వ్యాపారి బర్మా వెంకట్రావును శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేసి కొన్ని సంవత్సరాలుగా డబ్బులు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన కొంతమంది రైతులు శుక్రవారం సాయంత్రం గుంటూరులోని నగరపాలెం పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. తమకు రావాల్సిన డబ్బులను వెంకట్రావు నుంచి ఇప్పించాలని అధికారులను కోరారు. అనంతరం కలెక్టరును, ఎస్‌పిని కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వెంకట్రావుకు గత కొన్ని సంవత్సరాలుగా మిర్చిని అమ్ముతూ వచ్చామని, 2016 నుంచి ఇప్పటివరకు తమకు డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు వంద మంది రైతులు తమ గోడును అధికారులకు విన్నవించారు. వెంకట్రావును అరెస్టు చేసి జైలుకు ముందు తమకు రావాల్సిన డబ్బుల గురించి ఆలోచించాలని, తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి
- 6న కలెక్టరేట్లు, ఐసిడిఎస్ పిడి కార్యాలయాల ఎదుట ధర్నాలు
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలనే తదితర డిమాండ్లపై ఈ నెల 6న అన్ని జిల్లాల కలెక్టరేట్లు, ఐసిడిఎస్ పిడి కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ, రాష్ట్ర నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎ ఉమాదేవి, టి గజలక్ష్మి, ఎస్ జైనీ రత్నకుమారి, ఐ వేమేశ్వరితో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కనీస వేతనాలకు నోచుకోని అంగన్వాడీలు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఫేస్ యాప్‌ను వినియోగించాలని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్‌ఫోన్లు ఫేస్ యాప్‌ను సరిగ్గా తీసుకోక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అంగన్వాడీలకు ఫేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ పథకానికి అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీలను సచివాలయాల పరిధిలోకి తీసుకురావాలనడం సరైంది కాదన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి టిఎ బిల్లులు చెల్లించడం లేదన్నారు. సర్వీసులో ఉండి మృతి చెందిన అంగన్వాడీల కుటుంబాలకు బీమాతోపాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు జాబ్ కేలండరును రూపొందించాలన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధులను తగ్గించడం సరికాదని, పెంచాలని కోరారు. ఈ నెల 6న జరిగే ధర్నాల్లో పెద్దఎత్తున అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి చేతగాని సిఎం జగన్

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్
- వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

'అభివృద్ధిచేతగాని సిఎం జగన్' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వర స్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ పాదయాత్ర వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బంగారుపాళ్యం మండల కార్యాలయం సమీపంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. కిడ్నీ బాధితులు ఉచితంగా డయాలసిస్ చేసుకునేందుకు మిషనరీని అందించారు. అనంతరం పాదయాత్రగా గాండ్లపల్లి, విట్టూరు, బలిజపల్లి, శేషాపురం చేరుకున్నారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. అక్కడ నుంచి పాలేరు ఫ్లై ఓవర్ వరకు పాదయాత్ర చేపట్టి భోజన విరామం తీసుకున్నారు. అనంతరం పాదయాత్ర కొనసాగింపులో నాలుగు రోడ్ల రహదారిలో సభకు అనుమతి లేదని పోలీసులు నివారించారు. పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో సమీపంలోని ఓ భవనం పైకి ఎక్కి నారా లోకేష్ ప్రసంగించారు. సిఎంగా అభివృద్ధి చేయడం చేతగాక రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబునాయుడు సిఎం ఉన్నపుడు పలు పరిశ్రమలను



రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. 'యువగళం' స్పందన చూసి సిఎంకి భయంపట్టుకుందని, అందుకే అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, టిడిపి అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, పార్లమెంట్ అధ్యక్షులు పులివర్తి నాని, ఎఎంసి మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు హేమచంద్ర, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి అవార్డు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ (విజయవాడ)

ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌హెంట్ అవార్డు లభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 74వ జాతీయ మానసిక వైద్యుల వార్షిక సమావేశంలో విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డికి 2022-23 సంవత్సరానికి జాతీయ స్థాయిలో డాక్టర్ జె.కె.త్రివేది లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును శుక్రవారం అందజేశారు. గత నాలుగు దశాబ్దాలకుపైగా మానసిక వైద్యరంగంలో డాక్టర్ ఇండ్ల చేసిన సేవలకు, అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. సమాజంలోని మూఢనమ్మకాలను, అపోహలను తొలగించి, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఆయన ఎన్నో పుస్తకాలు రాశారు. తెలంగాణ జిల్లాలో బాణామతి, చేతబడి లాంటి మూఢనమ్మకాలు తొలగించేందుకు ఆ ప్రాంతాలలో ఎన్నోసార్లు పర్యటించారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ వినయ్‌కుమార్, మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.ఎస్.రాజు నుంచి డాక్టర్ రామసుబ్బారెడ్డి అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రామసుబ్బారెడ్డి

ఆప్కో బలోపేతానికి కృషి

- గంజి చిరంజీవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కో బలోపేతానికి కృషి చేయడంతోపాటు చేనేత కార్మికులకు అండగా నిలుస్తానని ఆప్కో నూతన ఛైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సిఎం తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఆప్కో అభివృద్ధికి పాటుపడతానన్నారు. విజయవాడ ఆప్కో కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా అత్యధిక మొత్తం అందించిన ప్రభుత్వం ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎమ్‌డి ఎంఎం నాయక్, దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేందర్, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ జింకా విజయలక్ష్మి, ఆప్కో జిఎంలు మైసూరు నాగేశ్వరరావు, తనూజారాణి, నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.

అది మ్యాన్ ట్యాపింగ్ : మంత్రి కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేస్తోన్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని, 'ఆడియో రికార్డ్' అని తెలిపారు. నెల్లూరులోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీధర్‌రెడ్డి ప్రతిపక్ష నేత చంద్రబాబు ట్రాప్‌లో పడి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పదవులు రాలేదన్న ఆవేదనతో మాట్లాడడం సరికాదన్నారు. కేవలం పదవుల కోసం శ్రీధర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం రాజకీయంగా ఆత్మహత్య లాంటిదన్నారు. ఫోన్ ట్యాపింగ్ నిజమైతే కోర్టుకు పోవచ్చని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. దీనిపై కాలయాపన ఎందుకని ప్రశ్నించారు. కోటంరెడ్డి భుజంపై గన్ పెట్టి కాల్చాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కేటుగాడు లాంటి వాడు పవన్ కల్యాణ్ అని విమర్శించారు. తోలుబొమ్మలాటలో కామెడీ పాత్ర పోషించేవాడిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మిగిలిపోక తప్పదన్నారు.

4 నియోజకవర్గాలకు టిడిపి ఇన్‌ఛార్జులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నాలుగు నియోజకవర్గాలకు నూతనంగా ఇన్‌ఛార్జులను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుని ఇన్‌ఛార్జిగా యనమల దివ్య, నెల్లిమర్ల ఇన్‌ఛార్జిగా కర్రోతు బంగార్రాజు, సత్యవేడు ఇన్‌ఛార్జిగా హెలెన్, పి గన్నవరం కన్వీనరుగా గంటి హరీష్ మాధుర్, కో కన్వీనరుగా నామన రాంబాబును ద్విసభ్య కమిటీ నియమించినట్లు పేర్కొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం (ఏలూరు జిల్లా)



తమ భూములకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా బలవంతంగా లాక్కొని రోడ్లు నిర్మిస్తున్నారంటూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామ శివారు నుండి నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పనులు నిలిపివేయాలంటూ పొంగుటూరు గ్రామానికి చెందిన రైతు మోహన్‌రావు యంత్రాలకు అడ్డుగా పడుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ భూములకు ఎకరాకు రూ.80 లక్షల ధర ఉందని, ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను న్యాయమైన పరిహారం చెల్లించే వరకు పనులు జరగనీయబోమని తేల్చి చెప్పారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులను పక్కకు తొలగించారు. ఈ క్రమంలో రైతులకు, పోలీస్, రెవెన్యూ అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను కలిసి ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నట్లు రైతులు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ దారుణం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 722వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాస్, బి.మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానీ వంటి కార్పొరేట్లను ప్రోత్సహించి దేశానికి తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. హిండెన్‌బర్గ్ రిపోర్టులతో అదానీ అసలు స్వరూపం బయటపడిందని తెలిపారు. అటువంటి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయాలని ప్రభుత్వం తహతహలాడడం దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో నాయకులు శేషగిరి, బిఎంఎల్.నాయుడు, బివి.సత్యనారాయణ, శివవర్మ, ఎస్.కృష్ణమూర్తి, కె.భద్రరావు, మంత్రి గోపి, పి.నర్సింగరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డిపై కిడ్నాప్ కేసు

- వైసిపి కార్పొరేటర్ ఫిర్యాదుతో నమోదు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ ఎం.విజయభాస్కరరెడ్డి ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే తనను కారులో బలవంతంగా ఎక్కించుకొని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఈ ఫిర్యాదులో విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ఆయన తన కార్యాలయంలోని కోటంరెడ్డి ఫ్లెక్సీని తొలగించారు. తాను వైసిపిలోనే కొనసాగుతానని, జగన్మోహన్‌రెడ్డికి తాను అభిమానినని ప్రకటించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి నెల్లూరు 5వ నగర పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కోటంరెడ్డిపై కిడ్నాప్ కేసు పెట్టారు. మా కార్పొరేటర్లను కోటంరెడ్డి బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని వైసిపి నెల్లూరు రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కాగా, తాను వైసిపిలో పని చేయలేనని కోటంరెడ్డి ఇప్పటికే ప్రకటించారు. తన ఫోన్‌ను వైసిపి పెద్దల ఆదేశాలతో ట్యాపింగ్ చేశారని విమర్శించారు. తనపై అక్రమ కేసులు బనాయించాలని, వేధింపులకు గురి చేయాలని చూస్తున్నారని గురువారం ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో కిడ్నాప్ కేసు నమోదు కావడం, కోటంరెడ్డిపై వైసిపి నేతలు, మంత్రులు మూకుమ్మడి విమర్శల దాడి చేస్తుండడంతో నెల్లూరులో రాజకీయ వాతావరణం మరింతగా వేడెక్కింది.

ఇసుక, మద్యం పేరుతో వేల కోట్ల దోపిడీ : శ్రీధర్‌రెడ్డి

రాష్ట్రంలో ఇసుక, మద్యం పేరుతో రూ.వేల కోట్ల దోపిడీ జరుగుతోందనీ, ఈ సొమ్ము అంతా ఎక్కడకు చేరుతోందో విచారణ చేసి నిగ్గుతేల్చాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అమెరికా ప్రెసిడెంట్‌కు కూడా సలహాలు ఇవ్వగలరని ఎద్దేవా చేశారు. ఇసుక, మద్యంలో వేల కోట్ల దోపిడీపై సజ్జల వివరణ ఇవ్వాలన్నారు. 'నన్ను అరెస్టు చేస్తారంటూ ఆయన లీకులిస్తున్నారు. ఏ నిమిషంలోనైనా అరెస్టు చేసుకోండి.. ఎన్ని కేసులైనా పెట్టుకోండి' అని సవాలు విసిరారు. ఈ సమావేశంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయానికి బడ్జెట్లో నిధులు పెంచాలి

- 9న రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను పూర్తిగా తగ్గించేసిందని, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. విజయవాడలోని దాసరి భవన్‌లో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, సామాజిక విశ్లేషకులు టి లక్ష్మినారాయణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకటగోపాల కృష్ణ తదితరులు మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించకుండా రైతులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఢిల్లీ ధర్నాల నేపథ్యంలో రైతు సంఘాల ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను కూడా పట్టించుకోలేదని అన్నారు. రూ.25 వేల కోట్లు అవసరమైన పోలవరం ప్రాజెక్టుకు కేవలం రూ.478 కోట్లు మాత్రమే కేటాయించి ఏ విధమైన అనుమతులు లేని కర్ణాటకలోని ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ 5,300 కోట్లు కేటాయించటం ఏం న్యాయమని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 30 శాతం కోత విధించడం వల్ల పని దినాలు కోల్పోయి వ్యవసాయ కార్మికులు వీధిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రతకు నిధులు తగ్గాయన్నారు. నరేంద్ర మోడీ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని కోరారు.

ముస్లిములకు అండగా ఉంటాం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార పార్టీ ప్రోద్బలంతో దాడులకు గురవుతున్న ముస్లిములకు అండగా ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిములు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో చంద్రబాబుతో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు శుక్రవారం భేటీ అయ్యారు. ముస్లిముల హక్కుల కోసం, రక్షణ కోసం పోరాడుతున్నామని, తమకు అండగా ఉండాలని సమితి అధ్యక్షులు ఫరూక్ షుబ్లీ చంద్రబాబును కోరారు. టిడిపి తీసుకొచ్చిన ముస్లిం పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని చంద్రబాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ అహ్మద్ షరీఫ్, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యేలు జలీల్ ఖాన్, అత్తర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేస్తే తప్పేముంది? : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి కమ్యూనికేట్ చేయడం కోసమే నవీన్, ఒఎస్‌డి కృష్ణమోహన్‌కు ఎంపి అవినాష్‌రెడ్డి ఫోన్ చేశారని, ఇందులో తప్పేముందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సిఎం క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిబిఐ విచారణ సందర్భంగా అవినాష్‌రెడ్డిని పిలిచిన సమయంలోనూ, జగన్ ఇంట్లో పనిచేసే నవీన్‌ను, ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డిని పిలిచినారని ఓ మీడియా అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. వివేకానందరెడ్డి హత్య గురించి శివప్రకాష్‌రెడ్డి తొలుత అవినాష్‌రెడ్డికి హత్య గురించి సమాచారం ఇచ్చారన్నారు. ఆ తర్వాతనే అవినాష్‌రెడ్డి స్పాట్‌కు వెళ్లారన్నారు.

'అప్పర్ భద్ర'కు నిధులు.. కోర్టు ధిక్కార చర్యే

- ఎపి సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెనుకబడిన రాయలసీమకు అన్యాయం చేసేలా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 నిధులు కేటాయించడం తగదని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనరు టి లక్ష్మినారాయణ తెలిపారు. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై కాకముందే సుప్రీం కోర్టులో కేసు నడుస్తుండగా, కొత్త ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం కోర్టు ధిక్కార చర్య అవుతుందని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాల పున పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుతో అన్యాయం జరిగిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని, ఇప్పుడు తెలంగాణ కూడా ఆ కేసులో ఇంప్లీడ్ అయ్యిందని తెలిపారు. ఈ కేసు విచారణలో ఉండగా కొత్త ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా కేంద్రం వ్యవహరిస్తున్నా.. సిఎం వైఎస్ జగన్ స్పందించకపోవడం తగదని అన్నారు. తక్షణం ఈ ప్రాజెక్టును నిలువరించేందుకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నేడు ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

- చైర్మన్ బొప్పరాజు వెల్లడి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం కర్నూలులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. కర్నూలు రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఎపి కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భావర రిషి, ఎన్నికల ఉప అధికారిగా రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పివి.కృష్ణారావు వ్యవహరిస్తారని తెలిపారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర మూడవ మహాసభ ఆదివారం కర్నూలులోని జిఆర్‌సి కన్వెన్షన్ హాల్‌లో నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారంతో మొదలవుతుందన్నారు. సరిగ్గా ఏడాది క్రితం పిఆర్‌సి సాధన కోసం లక్షలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు విజయవాడ వేదికగా ఉద్యమించారని, సంఘటిత శక్తితోనే ప్రభుత్వం చర్చలకు పిలిచిందని తెలిపారు. సెక్రటరీ జనరల్ వైవి.రావు, కర్నూలు జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి అసోసియేట్ చైర్మన్ టివి.ఫణి వీర్రాజు, కోశాధికారి వివి.మురళికృష్ణ నాయుడు, కో-చైర్మన్ కె.మల్లేశ్వరరావు, ఎపిపిటిడి ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు పాల్గొన్నారు.

కృష్ణమోహన్‌రెడ్డిని విచారించిన సిబిఐ

ప్రజాశక్తి - కడప

మాజీ మంత్రి వైఎస్. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను సిబిఐ అధికారులు వేగవంతం చేశారు. సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డిని, వైఎస్.భారతి పిఎ నవీన్‌ను శుక్రవారం కడప సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్‌లో సుమారు ఆరున్నర గంటలపాటు సిబిఐ అధికారులు విచారించారు. అవినాష్‌రెడ్డి ఫోన్ కాల్‌డేటా ఆధారంగా గతంలో కృష్ణ మోహన్‌రెడ్డి, నవీన్‌కు సిబిఐ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో వారిద్దరూ విచారణకు హాజరయ్యారు. వారు తెలిపిన సమాచారాన్ని సిబిఐ అధికారులు రికార్డు చేసినట్లు సమాచారం. గత నెల 28న కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని నాలుగున్నర గంటలపాటు విచారించి, ఆయన కాల్‌డేటాపై ఆరా తీసింది. నవీన్ అనే వ్యక్తి పేరిట ఉన్న మొబైల్ నంబర్‌కు అవినాష్ ఎక్కువగా కాల్‌చేసి మాట్లాడినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇప్పటికే రిమాండు ఖైదీలుగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌ను కూడా సిబిఐ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న నాయకులు

విభజన హామీల సాధనకు త్వరలో చలో పార్లమెంట్

- విద్యార్థి, యువజన సంఘాల సమరయాత్రలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకపోతే త్వరలో చలో పార్లమెంట్ చేపడతామని పలువురు వక్తలు అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ చేపట్టిన సమరయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత యాత్ర కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి చేరుకుంది. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బాలాజీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. బాలాజీ జంక్షన్ వద్ద, పూసపాటిరేగ మండలంలో జరిగిన బహిరంగ సభలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం నేరవేర్చకపోయినా రాష్ట్ర సర్కార్ నోరు మెదపడం లేదన్నారు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారే తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, విద్య, ఉపాధి కోసం ఎవరూ మాట్లాడడం లేదని విమర్శించారు. చలో పార్లమెంట్‌కు యువత తరలిరావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర ద్రోహి బిజెపికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెట్టారన్నారు. ప్రత్యేక హోదా తీసుకురాకపోతే 2024 ఎన్నికల్లో నిరుద్యోగ, విద్యార్థుల ఐక్యతతో బుద్ధి చెబుదామన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ, విశాఖలో పెట్రోలియం యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారని, ప్రస్తుతం వీటి గురించి అతీగతీ లేదని విమర్శించారు. యాత్రకు మద్దతు తెలిపిన సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ.. మూతబడిన జ్యూట్, ఫెర్రోయిల్లాస్ పరిశ్రమలు తెరిపించి, యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని, రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.లెనిన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, ,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ యాత్ర శనివారం శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించనుంది.

కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..కొవ్వాడలో ఆరు అణు విద్యుత్ రియాక్టర్ల ఏర్పాటుకు వెస్టింగ్‌హౌస్ కంపెనీతో చర్చలు జరుపుతున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వైసిపి, టిడిపి పార్లమెంటు సభ్యులు కొవ్వాడ అణుపార్కును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్లగానీ, మానవ తప్పిదం వల్లగానీ, యంత్ర లోపాల వల్ల గానీ ఏ చిన్న ప్రమాదం సంభవినా ఇటు కాకినాడ నుంచి అటు ఒడిశాలోని ఛత్రపూర్ వరకు భూమి, నీరు, గాలి సమస్తం విషతుల్యమవుతాయని, సమస్త జీవకోటి నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికా, జర్మనీ, జపాన్ వంటి సాంకేతిక పరిజ్ఞానం గల దేశాలు అణువిద్యుత్ కేంద్రాలను మూసివేస్తున్నాయని గుర్తుచేశారు. గుజరాత్ రాష్ట్రంలోని మితివిర్ధిలో అణువిద్యుత్కేంద్రాన్ని అక్కడి బిజెపి ప్రభుత్వం, ప్రజలు వ్యతిరేకించడంతో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని కొవ్వాడకు తరలించారని విమర్శించారు.

సంఘ సేవను అలవర్చుకోవాలి : గవర్నరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసమేనని, సంఘ సేవను సైతం అలవర్చుకోవాలని గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. చదువుకు ఆటంకం లేకుండా సేవ చేసే అవకాశాన్ని అందించే జాతీయ సేవా పథకంలో ప్రతి విద్యార్థీ భాగస్వామ్యం కావాలన్నారు. గవర్నరుతో జాతీయ సేవా పథకంలోని విద్యార్థులు రాజ్‌భవన్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. గవర్నరు మాట్లాడుతూ.. ఒక మనిషి మరో మనిషికి సహకరించడం మానవతా లక్షణమని, జాతీయ సేవా పథకం విద్యార్థులు దీనిని ఆచరించడం ముదావహమన్నారు. రానున్న రోజుల్లో ఎపి విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, గవర్నరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో విద్య, వైద్య సేవలు

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి
- రాయపూడి, కురగల్లు గ్రామాల్లో ఎఎస్ఎస్‌సిసిఎల్ పైలెట్ ప్రాజెక్టుల సందర్శన



రాజధాని ప్రాంతం రాయపూడి లో ఆరోగ్య కేంద్రం - వెల్‌నెస్ సెంటర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి, వివేక్ యాదవ్

ప్రజాశక్తి - తుళ్లూరు, మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో విద్య, వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తెలిపారు. రాజధాని ప్రాంతమైన రాయపూడి, కురగల్లు గ్రామాల్లో అమరావతి స్మార్ట్, సస్టైనబుల్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎఎస్-ఎస్‌సిసిఎల్) కింద నిర్మితమవుతున్న పలు పైలెట్ ప్రాజెక్టులను సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. తొలుత రాయపూడిలో రూ.1.77 కోట్ల వ్యయంతో నిర్మిస్తోన్న ఆరోగ్య కేంద్రాన్ని, మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలో రూ.1.25 కోట్లతో నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వంద స్మార్ట్ నగరాల్లో ఒక నగరంగా అమరావతి ఎంపిక జరిగిందని తెలిపారు. కురగల్లులో అధునాతన సదుపాయాలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ప్రీఎడ్యుకేషన్ అందించటానికి ఆధునిక వసతులతో ఉందన్నారు. అమరావతిలోని మరో 22 గ్రామాల్లో హైటెక్ అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

రూ.1.77 కోట్లతో జరుగుతున్న హెల్త్, వెల్‌నెస్ సెంటర్ పనులు త్వరలో పూర్తకానున్నాయని, దీంతో అమరావతి ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని చెప్పారు. ఇ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ ద్వారా వ్యాధుల బారినపడకుండా యోగా, ప్రాణాయామం, న్యూట్రీఫుడ్, ప్రీవెంట్ మెడిసిన్ సేవలు, వృద్ధులకు కండరాల సమస్యల నుంచి ఉపశమనం కలిగించేందుకు అవుట్‌డోర్ జిమ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ కట్టా సింహాచలం, వైద్యాధికారి డి శ్రీనివాస్, ఎంపిడిఒ ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక పింఛను ఇప్పించాలని వలంటీర్ల వినతి

రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ.2,500 నెలవారీ అమరావతి సామాజిక పింఛను ఇప్పించాలని తుళ్లూరులో వలంటీర్లు పురపాలక, పట్టణాభివద్ధిశాఖ స్పెషల్ సిఎస్ వై.శ్రీలక్ష్మి కోరారు. నమాజు చేసుకునేందుకు ఈద్గా నిర్మాణానికి కృషి చేయాలని ముస్లిం మైనార్టీ నాయకులు, అసైన్డ్ రైతులకు కౌలు, అంబేద్కర్ స్మృతివనం నిర్మాణానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య శ్రీలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు.

గుంటూరు-గుంతకల్లు లైనుకు రూ.980 కోట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-గుంతకల్లు రైల్వే లైను డబ్లింగ్, విద్యుద్దీకరణకు ఈ ఏడాది రూ.980 కోట్లు కేటాయించినట్టు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ తెలిపారు. 2016-17లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు రూ.3631 కోట్ల అంచనాలతో చేపట్టామన్నారు.గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 2023-24 సంవత్సరంలో బడ్జెట్‌లో వివిధ రైల్వే లైన్ల నిర్మాణం నిమిత్తం నిధుల కేటాయింపు వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణంలో భాగంగా ఈ ఏడాది రూ.202 కోట్లు కేటాయించి నట్లు తెలిపారు. 2011-12లో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 309 కిలో మీటర్ల మేర కొత్త లైను నిర్మాణం జరుగుతోందని చెప్పారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ధర్మవరం పట్టణానికి చెందిన జింకా హరీశ్ (28) మగ్గం నేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉండేవారు. కుటుంబపోషణ, ముడిపట్టు కోసం సుమారు రూ.20 లక్షల వరకు అప్పు చేశారు. అప్పు చెల్లించే దారిలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

10 నుంచి సభ్యత్వ నమోదు

- పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 10వ తేదీ నుంచి 28 వరకు పార్టీ మూడో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రెండు విడతల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేసిన 6,400 మంది వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పార్టీ క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు, ప్రమాద బీమా కోసం తన వంతుగా ఈ నెల 10న మరోసారి విరాళం అందిస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

72 స్టేషన్లలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.8,406 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో రైల్వే హెడ్ క్వార్టర్స్‌కు సంబంధించిన డిజైన్లు ఖరారయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.13,786 కోట్లు కేటాయించగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.8,406 కోట్లు కేటాయించామన్నారు. రైల్వే బడ్జెట్ గురించి ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 65 శాతం నిధులు అత్యధికంగా కేటాయించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 72 రైల్వే స్టేషన్లలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వందే భారత్ రైలుకు 120 శాతం ఆక్యుపెన్సీ రేటు ఉందన్నారు. విజయవాడ డిఆర్ఎం శివేంద్రమోహన్ మాట్లాడుతూ.. ఎపి, తెలంగాణకు (ఎస్‌సిఆర్ రైల్వేస్) రూ.4,418 కోట్లు ప్రధాని కేటాయించారని, రైల్వే బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు అవసరమైన చోట నిర్మిస్తున్నామని, ప్రయాణికుల రోజువారీ అవసరాల కొనుగోళ్ల కోసం రైల్వే స్టేషన్లలో దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో హైడ్రోజన్ రైలు కూడా అభివృద్ధి చెందుతోందని, రెండు నగరాల మధ్య 60 నుంచి 70 కిలోమీటర్ల దూరంతో వందే భారత్ మెట్రోకు ప్లాన్ చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

కేటాయింపులు

- విజయవాడ-గుడివాడ-మచిలీపట్నం, భీమవరం, నరసాపూర్, నిడదవోలు డబ్లింగ్, విద్యుదీకరణ కోసం - రు.100 కోట్లు
- ధర్మవరం-పాకాల-కాట్పడి డబ్లింగ్ కోసం రూ.40 కోట్లు
- గుంటూరు-బిబినగర్ డబ్లింగ్ కోసం రూ.60 కోట్లు
- కాకినాడ - నరసాపురం రూ.10 లక్షలు
- కడప - బెంగళూరు రూ.10 లక్షలు
- నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు రూ.202 కోట్లు
- గూడూరు - దుగ్గరాజపట్నం రూ.10 లక్షలు
- విజయవాడ - గుంటూరు వయా అమరావతి రైల్వే లైన్‌కు రూ.10 లక్షలు
- గూడూరు - రేణిగుంట డబ్లింగ్ కోసం రూ.6.40 లక్షలు
- కోటిపల్లి -నరసాపూర్ కొత్త లైన్ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు
- విజయవాడ - గూడూరు మూడో లైన్‌కు రూ.800 కోట్లు
- గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.980 కోట్లు
- కాజీపేట - విజయవాడ మూడో లైన్‌కు రూ.337.52 కోట్లు
- గూటి - ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.90.6 కోట్లు
- ధర్మవరం-పాకాల-కాట్పడి డబ్లింగ్‌కు రూ.40 కోట్లు
- విజయవాడ కాజీపేట, రేణిగుంట, గూటి ఎపి,
- తెలంగాణ, కర్ణాటక బై-పాస్ లైన్ల నిర్మాణానికి రూ.383.12 కోట్లు

సంపాదకీయం

మాంద్యం మేఘాలు

'పెట్టుబడి'కి పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలతో పాటు ప్రపంచమంతటా మాంద్యం మేఘాలు ఆవరించాయి. సంపద కేంద్రీకరణ వినాశకర విధానాల వల్ల ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న దశలో కోవిడ్ మహమ్మారి ముంచెత్తడం, లాక్‌డౌన్లు తదితర పరిణామాలతో మళ్లీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే ఎత్తుగడలనే పాలకులు అవలంబించడంతో ఎక్కడికక్కడ ఆర్థిక అసమానతలు పెరిగి సంక్షోభం మరింతగా ముదిరింది. బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం కారణంగా, రైల్వే సిబ్బంది, వైద్యులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల ఉద్యోగులు సమ్మెలతో హోరెత్తిస్తున్నారు. లక్షలాది మంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి సంఘీభావం తెలియజేస్తూ ప్రజా ఐక్యత చాటుతుండటం హర్షణీయం. ఫ్రాన్స్‌లో పెన్షన్ వయస్సును 64 ఏళ్లకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 11 లక్షల మందికి పైగా కార్మికులు రెండు వారాల్లో రెండోసారి నిరసన చేపట్టారంటే ఆర్థిక సంక్షోభ ప్రభావాలు వారిపై ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆస్ట్రేలియాలో రవాణా కార్మికుల సమ్మె సైతం పెట్టుబడిదారీ దోపిడిపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహంలో నుంచి పుట్టుకొచ్చిందే. శ్రీలంక, ఆ తరువాత పాకిస్తాన్ ఇలా ఒక్కొక్కటిగా ఆసియా దేశాలు కూడా సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలతో భారత్ కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిందే దరిమిలా మౌలిక, సేవా, ఆహార రంగాలన్నింటిని అంబానీ, అదానీలకే దోచిపెడుతున్న వైనాన్ని చూస్తున్నాం. ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తున్న అదాని కుంభకోణం..దానికి బ్యాంకులు, ఎల్‌ఐసి వంటి విత్త సంస్థలు రూ.వేలాది కోట్లు రుణాలు కుమ్మరించినందున దేశ ఆర్థిక వ్యవస్థపై ఇంకెంతటి ప్రభావం చూపనుందో!


ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాలను కుదిపేస్తున్న ప్రజాందోళనలకు కారణం ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలే. సంక్షోభం అనేది 'పెట్టుబడి' విత్తులోనే దాగుందన్నది మార్క్సిజం ఏనాడో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సంక్షేమ రాజ్య విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలు.. ఆ తర్వాత థాచర్–రీగన్ సూత్రీకరణలతో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మార్కెట్‌కు దోచిపెట్టడమే ప్రధాన బాధ్యతగా నయా ఉదారవాద దోపిడి మంత్రాంగాన్ని జపిస్తూవచ్చాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థల మాటున రుణాలు ఎరగా వేసి పేద, వర్ధమాన దేశాలను పెట్టుబడిదారీ దేశాలు నడ్డివిరుస్తూ వస్తున్నాయి. విత్త సంస్థల షరతులతో పాలకులు మోకరిల్లడంతో శ్రామికులు, రైతులు, సాధారణ ప్రజానీకం బతుకులు అగమ్యగోచరంగా మారిన సంగతి విదితమే. స్వేచ్ఛా వాణిజ్యం మాటున పెట్టుబడిదారీ గుత్తాధిపత్యానికి అన్ని రంగాలలో స్వేచ్ఛను అనుమతించడంతో ప్రపంచంలో అసమానతలను ఆకాశమంత పెరిగిపోయాయి.

ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో సహా ప్రస్తుత ఆర్థిక మాంద్యం మేఘాలు ఆవరించడానికి కోవిడ్‌ను, రష్యా–ఉక్రెయిన్ వివాదాన్ని పెట్టుబడిదారీ దేశాలు సాకుగా చెబుతున్నాయి. వాస్తవానికి 2008లో అమెరికాలో మొదలైన ప్రపంచ సంక్షోభానికి ఇది కొనసాగింపే తప్ప కొత్తగా పురుడుపోసుకున్నది కాదు. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ మరియు అమెజాన్ వంటి పెద్ద టెక్ కంపెనీలన్నీ ఉద్యోగుల తొలగింపును ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. గత ఏడాది టెక్ కంపెనీలు లక్షన్నర మందికి పైగా ఉద్యోగులను ఇళ్లకు పంపినట్లు అంచనా. రోబోల కంటే హీనంగా వేతనజీవులను అమెజాన్ రాచిరంపాన పెడుతోందంటూ గత వారం బ్రిటన్‌లోని అమెజాన్ కార్మికులు సెంట్రల్ ఇంగ్లండ్‌లోని కంపెనీ గిడ్డంగి వద్ద సమ్మె చేపట్టారు. ఒక్క అమెజానే కాదు..కార్పొరేట్ కంపెనీలన్నీ ఇదే తీరుతో శ్రమదోపిడికి పాల్పడుతున్నా..పాలకులు నోరు మెదపడం లేదు. సులభ వ్యాపార ర్యాంకింగ్‌లో పోటాపోటీగా కార్పొరేట్ సేవలో పునీతమవుతున్నారే మినహా కష్టజీవుల గోడు పట్టడం లేదు. భారత్‌లో ఆర్థిక సంక్షోభాన్ని కప్పిపుచ్చేందుకు జాతియత, మెజారిటీ మతన్మోద ఆగడాల కత్తి దూస్తోంది. ఈ దరిమిలా విశాల ఐక్య వేదికలు నిర్మించి అటు కార్పొరేట్ దోపిడినీ, ఇటు మతోన్మాద దాడులను తిప్పికొడితోనే ప్రజానీకానికి మనుగడ.

మహనీయుల మాట



అన్నింటికీ మించిన నేరం అన్యాయంతోనూ, అక్రమాలతోనూ రాజీ పడటమే.
- నేతాజీ సుభాష్ చంద్ర బోస్



విశ్లేషణ

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా లొంగుబాటేనా?





> రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కేటాయించలేదు. ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనే లేదు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో కూడా పేర్కొనలేదు. పైపెచ్చు కేంద్ర విద్యాసంస్థలకు గతేడాది కేటాయించిన నిధుల్లో కూడా తెగ్గోశారు. మరో వైపు ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రకారం రాష్ట్రానికి నిధులు బదిలీ చేయకుండా భారీ కోతకు పాల్పడింది. రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసేలా అనేక ఆంక్షలు పెట్టింది. అప్పులపై కూడా షరతులు విధించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసింది.

2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.45.03 లక్షల కోట్లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర ద్రోహం చేసింది. రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కేటాయించలేదు. ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనే లేదు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో కూడా పేర్కొనలేదు. పైపెచ్చు కేంద్ర విద్యాసంస్థలకు గతేడాది కేటాయించిన నిధుల్లో కూడా తెగ్గోశారు. మరో వైపు ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రకారం రాష్ట్రానికి నిధులు బదిలీ చేయకుండా భారీ కోతకు పాల్పడింది. రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసేలా అనేక ఆంక్షలు పెట్టింది. అప్పులపై కూడా షరతులు విధించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసింది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం ఎడల ఇంత వివక్షత, ద్రోహం జరిగినా ముఖ్యమంత్రి కనీసం నోరు విప్పలేదు. రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాత్రం కొన్ని సన్నాయి నొక్కులతో బడ్జెట్ అందరికి ఉపయోగపడేలా ఉందని కితాబునిచ్చారు. గత నాలుగేళ్ళ నుండి రాష్ట్ర వైసిపి ప్రభుత్వం బిజెపితో స్నేహం చేస్తూ విభజన హామీలను నీరుగార్చేస్తున్నది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు కూడా వైసిపి ధోరణి లోనే స్పందించారు. బడ్జెట్‌లో మన రాష్ట్రానికి, రాష్ట్ర ప్రాజెక్టులకు ఆశించిన కేటాయింపులు జరగలేదని పేర్కొంటూనే మొత్తం బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని కొనియాడారు. ఇది బిజెపి ఎడల పూర్తిగా అవకాశవాద లొంగుబాటు ధోరణి. 2014లో అధికారంలో ఉన్నప్పుడు ఇప్పుడు కూడా తెలుగుదేశం కేంద్ర బిజెపి ఎడల మెతక వైఖరితో అవకాశవాద రాజకీయాలు నడుపుతున్నది. అందువల్లే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా హాని చేస్తున్నా కేంద్రాన్ని కనీస స్థాయిలో కూడా తెలుగుదేశం నిలెయ్యలేకపోతున్నది. ఇక జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కేంద్ర బడ్జెట్‌కు పూర్తిగా సాగిలపడిపోయారు.

బడ్జెట్‌లో ఉన్న అంశాలను పరిశీలిస్తే బడ్జెట్‌లో పోలవరం ఊసే ఎత్తలేదు. రాష్ట్రానికి ఇది చాలా కీలకమైన భారీ నీటి ప్రాజెక్టు. జాతీయ ప్రాజెక్టు. నత్తనడకన సాగుతున్నది. కేంద్ర ప్రభుత్వమే ఈ ప్రాజెక్టు పూర్తిచేయడానికి నిధులు భరించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 4785 కోట్లు మాత్రమే ఇచ్చింది. 2023–24 బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. రాష్ట్రం ఇప్పటి వరకు చేసిన వ్యయంలో రూ. 2873 కోట్లు కేంద్రం తిరిగి చెల్లించాలి. దీనికి కూడా అతీగతీ లేదు. ముఖ్యమంత్రి ప్రతి ఢిల్లీ పర్యటనలోను ఈ ప్రాజెక్టుకు రూ. 10 వేల కోట్ల తాత్కాలిక నిధులు మంజూరు చేయమని ప్రధానిని వేడుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నాబార్డ్ నుండి రుణాలు ఇప్పిస్తామని కేంద్రం చెబుతున్నది. ఈ భారం రాష్ట్రం మోయలేనిది. ప్రాజెక్టు పూర్తికావాలంటే ఇంకా రూ. 25 వేల కోట్లు అవసరమని నిపుణులు అంటున్నారు. ఇంకోవైపు ఈ ప్రాజెక్టు నిర్వాసితులకు నేటికి పునరావాస ప్యాకేజి ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ వివక్షత వల్ల ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అంతులేని కథలా కొనసాగుతున్నది.

ఇప్పుడు మరో వివాదాన్ని మోడీ తీసుకొచ్చారు. త్వరలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందటానికి కర్ణాటక లోని 'అప్పర్ భద్ర' నీటి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఏకంగా రూ.5300 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తుంగభద్ర దిగువ ప్రాంతమైన ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ ప్రాంతానికి ప్రమాదం ఏర్పడుతుందని అంటున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు 'కెన్ బెత్వా' కు రూ.3500 కోట్లు కేటాయించారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి పెదవి విప్పకపోవడం దారుణం.

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుపై ఈ బడ్జెట్‌లో కూడా ఎలాంటి ప్రస్తావన చేయలేదు. కనీసం నిధులు కూడా కేటాయించలేదు. జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రెండేళ్ళ క్రితమే రూపొందించారు. దీనికోసం గతంలో రూ.170 కోట్లు ప్రకటించారు. అదీ ఇవ్వలేదు. గత నవంబర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి అట్టహాసంగా భారీ బహిరంగ సభను నరేంద్ర మోడీతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే జోన్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారని హడావుడి చేసి ఆ తరువాత లేదని చావుకబురు చల్లగా చెప్పారు. ఈ మధ్య జరిగిందేంటి? ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్ర బిజెపి సర్కార్ రద్దు చేసింది. కొత్త జోన్ రాకపోగా ఉన్న డివిజన్ కోల్పోయాం. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిరంకుశ నిర్ణయంపై స్పందించలేదు.

దేశవ్యాప్తంగా మెట్రోరైల్ల ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో రూ.19,518 కోట్లు కేటాయించారు. కానీ మన రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణానికి ఎలాంటి కేటాయింపులు లేవు. గత ఐదేళ్ల నుండి ఇదే తంతు కొనసాగుతున్నది. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం కేంద్రం దయాదాక్షిణ్యమేమీ కాదు. రాష్ట్రం హక్కు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన చట్టబద్ధ హామీలు. దశాబ్దకాలం అవుతున్నా ఇవి ఆచరణకు నోచుకోవడంలేదు. ఈ బడ్జెట్‌లో కూడా వీటి గురించి ఒక్క మాట కూడా లేదు. రైల్వేలైన్లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనలు లేవు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా ఈ బడ్జెట్‌లో కోత పెట్టారు. ప్రస్తుత 2022–23 సంవత్సరంలో సవరించిన బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.89400 కోట్లు ఖర్చు చేస్తున్నది. 2023–24 బడ్జెట్‌లో 33 శాతం తగ్గించి రూ.60 వేల కోట్లకు కుదించింది. దీంతో మన రాష్ట్రం సుమారు వెయ్యి కోట్లు పైబడి నష్టపోతున్నది. గత కొంత కాలంగా ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడం, కూలీలకు వేల కోట్ల రూపాయిల బకాయిపడ్డ వేతనాలు చెల్లించకపోవడం తెలిసిందే. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ కోతతో ఈ పథకం రాష్ట్రంలో మరింత బలహీనపడే ప్రమాదం ముంచుకొచ్చింది.

గత బడ్జెట్‌లో రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల అనుసంధానానికి, పట్టణ నీటి సరఫరాకు, ఆరోగ్య రక్షణకు, విశాఖ, చెన్నై కారిడార్ వంటి పథకాలకు 2022–23లో రూ.6345 కోట్లు కేటాయించి రూ. 2553 కోట్లుకు కుదించారు. సవరించిన బడ్జెట్‌లో ఏకంగా రూ. 3792 కోట్లు కోత పెట్టారు. 2023–24లో కేవలం రూ.2206 కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారు.

ఆహార భద్రతకు, ఎరువులు, పెట్రో (ముఖ్యంగా వంట గ్యాస్) సబ్సిడీలపై ఎన్నడూ లేని విధంగా దారుణంగా కోత పెట్టారు. ఏకంగా రూ.5.21 లక్షల కోట్ల నుండి రూ.3.74 లక్షల కోట్లకు తగ్గించారు. ఆహార భద్రతకు 2022–23లో రూ.2,87,19 కోట్లు ఖర్చు చేస్తుండగా 2023–24లో రూ.1,97,350 కోట్లకు, ఎరువులకు రూ.2,25,220 కోట్ల నుండి రూ.1,75,100 కోట్లకు, వంటగ్యాస్‌పై రూ.9,171 కోట్ల నుండి 2,257 కోట్లకు కుదించారు. మొత్తంగా 28 శాతానికి పైగా కోత విధించారు.

ఆహార సబ్సిడీపై కోత వల్ల రాష్ట్రాలపై భారం పెరుగుతుంది. రాష్ట్రాలకు సబ్సిడీ కింద సరఫరా చేసే ఆహార ధాన్యాల కోటా తగ్గిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న కోటి 45 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులందరికి ఆహార భద్రత చట్టం కింద ఆహార ధాన్యాలు సరఫరా చేయడంలేదు. కేవలం కేంద్రం పేదరిక గీతగా నిర్ణయించిన ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 75 శాతం, పట్టణ ప్రాంతంలో 50 శాతానికి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఒకే దేశం–ఒకే కార్డు కింద నగదు బదిలీ పథకం అమలుకు కేంద్రం ఒత్తిడి తెస్తున్నది. ఇవన్నీ మన రాష్ట్రంలోని ప్రజా పంపిణి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆహార ధాన్యాల సేకరణ, రైతుల పంటల మద్దతు ధరపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడనున్నది.

ఎరువుల సబ్సిడీ కోత వల్ల ఎరువుల ధరలు భారీగా పెరిగి రైతులపై భారం పెరగనున్నది. వంటగ్యాస్ సబ్సిడి పూర్తిగా ఎత్తివేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పయనించటంతో గ్యాస్ ధరలు ఇంకా పెరగనున్నాయి. వీటిని రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంగా రాష్ట్ర ప్రభుత్వం చూడకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

గత తొమ్మిదేళ్ళుగా ఎదురు చూస్తున్న కడప స్టీల్‌ప్లాంట్, దుగ్గరాజుపట్నం పోర్టుల నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో కూడా మొండి చెయ్యి చూపారు. నిధుల కేటాయింపు సరే, కనీస ప్రస్తావన కూడా లేదు. వీటికి పూర్తిగా తిలోదకాలిచ్చినట్లే కనిపిస్తున్నది.

ఇక విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే దిశగానే పావులు కదుపుతున్నారు. ఈ బడ్జెట్‌లో కూడా దీనిని పేర్కొన్నారు. రెండేళ్ళకు పైగా ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా ముందుకే నడుస్తున్నది. ఈ బరితెగింపుకు బిజెపికి ఊతం ఇస్తున్నది రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీల లొంగుబాటు వైఖరే. ఇప్పుడు ఏకంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని సగానికి సగం తగ్గించేసి భారీ నష్టాలకు గురిచేసే చర్యలకు బిజెపి వొడిగట్టింది. అయినా నరేంద్ర మోడీని ఈ మూడు పార్టీలు ప్రశ్నించలేకపోతున్నాయి.

చివరికి రాష్ట్ర హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నా, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కోతపెడుతున్నా, అప్పులపై షరతులు విధిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మోడీతోటే అంటకాగుతున్నది. ఉదాహరణకు 14వ ఆర్థిక సంఘం నిర్దేశించిన కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి 42 శాతం నిధులు బదిలీ కావాలి. కానీ ఈ బడ్జెట్‌లో 31.25 శాతం మాత్రమే అంటే రూ.41,338 కోట్లే ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాల ఎడల కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్ల నుండి ఇదే వైఖరి వ్యవహరిస్తున్నది. విభజన చట్టం ప్రకారం రాష్ట్ర రెవిన్యూ లోటును నేటికి కేంద్రం భర్తీ చేయలేదు. ద్రవ్య బాధ్యత–ఆర్థిక నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బిఎం) పేర ఈ బడ్జెట్‌లో కూడా రాష్ట్రాల ద్రవ్యలోటు 3.5 శాతం దాటకూడదని షరతు విధించింది. రాష్ట్రాల బడ్జెటేతర రుణాలను కూడా రాష్ట్ర అప్పుల్లో కలిపి రుణ సామర్థ్యాన్ని లెక్కిస్తామని కేంద్రం బెదిరిస్తున్నది. అదనపు అప్పులు కావాలంటే విద్యుత్, పట్టణ, కార్మిక తదితర రంగాల్లో సంస్కరణలు అమలు చేయాలని నిబంధనలు విధిస్తున్నది. అయినప్పటికీ... రాష్ట్ర ప్రభుత్వం వీటన్నింటికి తలూపుతూ రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నది.

మొత్తంగా బిజెపి ఎడల ఈ మూడు పార్టీల అవకాశవాద లొంగుబాటు వల్ల ప్రతి బడ్జెట్ లోను ఆంధ్ర రాష్ట్రానికి వివక్షత కొనసాగుతున్నది. విభజన హామీలు అమలు కాకుండా నీరుగారి పోతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో పడింది.

డా॥ బి. గంగారావు

(వ్యాసకర్త సెల్ : 9490098792)

★

కామెంట్

బట్టబయలైన అదానీ అవినీతి సామ్రాజ్యం



> ఏళ్ళ తరబడి, గౌతమ్ అదానీ తన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న తీరుపై అనేక తీవ్రమైన ప్రశ్నలు, ఆరోపణలు వచ్చాయి. బొగ్గు దిగుమతులకు అధిక మొత్తాలు చెల్లించినట్లు చూపించడం, తన కంపెనీలకు విదేశాల్లో నిధులు అందడంపై పారదర్శకత పాటించకపోవడం, పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించడం, నియమ నిబంధనలను తనకు అనుకూలంగా మలచుకుంటూ ప్రాజెక్టులను పొందిన తీరు పై మీడియాలో, వాణిజ్య విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతూనే వచ్చారు. కానీ, వీటిల్లో ఏ అంశంపైనా సెబి కానీ, ఆర్‌బిఐ కానీ, ఇడి వంటి ప్రభుత్వ నియంత్రణా సంస్థలు కానీ స్పందించిన దాఖలాలు లేవు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

అమెరికాకు చెందిన అతి చిన్న మదుపరుల సంస్థ భారతదేశంలోని అతి పెద్ద, శక్తివంతమైన అదానీ గ్రూప్‌ను సవాలు చేసి, దాని పునాదులనే కదిలించేసింది. హిండెన్‌బర్గ్ రీసెర్చి అనే ఈ షార్ట్ సెల్లింగ్ సంస్థ అదానీ గ్రూపుపై 129 పేజీలతో నివేదిక వెలువరించింది. అదానీ గ్రూపునకు చెందిన ఏడు కంపెనీలతో సంబంధమున్న 578 అనుబంధ సంస్థల, షెల్ కంపెనీల నిధుల సేకరణ కార్యకలాపాలు, దేశం వెలుపల సాగించే కార్యకలాపాల గురించి అనేక ఆధారాలను అందులో పొందుపరిచింది. ఇది 'కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద మోసం'గా హిండెన్ బర్గ్ నివేదిక పేర్కొంది.

నిధులు, బూటకపు కంపెనీల సంక్లిష్టమైన నెట్‌వర్క్‌ను ఈ నివేదిక బయటపెట్టింది. ఈ షెల్ కంపెనీల్లో కొన్ని మారిషస్‌లో, సైప్రస్‌లో, యుఎఇలో వున్నాయి. లిస్టెడ్ కంపెనీల షేర్ల ధరలను తారుమారు చేయడానికి తెలివిగా ఈ డొల్ల కంపెనీలను ఉపయోగించారు. అధిక రుణాలు, అంతంతమాత్రం ఆస్తులు మాత్రమే ఉన్న ఈ సంస్థల ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని, రుణాలను చెల్లించగలిగే సామర్థ్యం వాటికి ఉందని చెప్పుకునేందుకు లిస్టెడ్ కంపెనీల ఆస్తి అప్పుల పట్టీ (బ్యాలన్స్ షీట్)లను చూపించారు. వాటికి డబ్బును మళ్లించడానికి ఈ డొల్ల కంపెనీలను వాడుకున్నారు. అదానీ కంపెనీల విలువను వాస్తవిక రేటు కన్నా దాదాపు 85శాతం ఎక్కువ చేసి చూపారని ఆ నివేదిక అంచనా వేసింది. స్టాక్ మార్కెట్‌లో దారుణమైన అవకతవకలకు పాల్పడుతూ, అకౌంటింగ్‌లో పెద్దయెత్తన అక్రమాలకు పాల్పడడం ఇదంతా అదానీ గ్రూపు ఒక పక్కా పథకం ప్రకారం చేసిన చర్యగా హిండెన్స్‌బర్గ్ నివేదిక ఆరోపించింది.

హిండెన్‌బర్గ్ నివేదికను 'భారత్‌పై ఒక పథకం ప్రకారం జరిగిన దాడి' అంటూ అదానీ గ్రూపు ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. అయితే, తన వాదనను సమర్థించుకోవడానికి అది ఎలాంటి ఆధారాలను చూపలేకపోయింది. జాతీయవాదం ముసుగులో తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అది ప్రయత్నించింది. "భారతదేశ సంస్థల స్వతంత్రత, సమగ్రత, నాణ్యత, వృద్ధి కథనం, వడివడిగా అడుగులు వేయాలన్న భారత్ ఆకాంక్షను చూసి సహించలేకనే ఈ రకమైన దాడి" చేస్తున్నారని గావు కేకలు పెడుతోంది.

హిండెన్‌బర్గ్ నివేదిక ప్రభావం వెంటనే కనిపించింది. నివేదిక వచ్చిన తరువాత వారంలోనే అదానీ గ్రూపు 6,700 కోట్ల డాలర్లను లేదా స్టాక్ మార్కెట్‌లో దాదాపు రూ.5.6 లక్షల కోట్ల మార్కెట్ పెట్టుబడులను నష్టపోయింది. గౌతమ్ అదానీ తన సంపదలో 5వేలకోట్ల డాలర్ల మేరకు నష్టపోయారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో మూడవ వ్యక్తిగా వున్న అదానీ ఒక్కసారిగా 15వ స్థానానికి పడిపోయారు.

అదానీ గ్రూపు సంపదలో చాలా వరకు దేశ సహజ వనరులను అనేక ఏళ్లుగా లూటీ చేస్తూ, ప్రభుత్వ నిధులను కొల్లగొట్టడం ద్వారా సమకూర్చుకున్నదే. అందువల్లే అదానీ గ్రూపు మోసపూరిత లావాదేవీలపై ప్రజలు ఇంతగా ఆందోళన చెందుతున్నారు. అదానీ గ్రూపు ఓడరేవులు, విమానాశ్రయాలకు సంబంధించి అతిపెద్ద ప్రైవేట్ ఆపరేటర్‌గా అవతరించింది. ఆహార ధాన్యాల గిడ్డంగుల్లో అతిపెద్దదిగా వుంది, విద్యుత్ ట్రాన్స్‌మిషన్‌లో అయిదోవంతు భాగాన్ని కలిగి ఉంది, సిమెంట్ పరిశ్రమను శాసిస్తుంది.బొగ్గు తవ్వకాల్లో అతిపెద్ద వాటా కలిగి దేశంలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్ ప్రైవేటు ఉత్పత్తిదారుగా అదానీ గ్రూపు వుంది. మోడీ ప్రభుత్వ చలవతోనే అదానీ ఇంత వేగంగా ఎదిగాడనేది నిర్వివాదాంశం.

జాతీయ బ్యాంకుల నుండి రుణాలు పొందడం, జీవిత బీమా సంస్థ వంటి సంస్థల నుండి వచ్చిన పెట్టుబడుల ద్వారా ఆస్తులు, కొనుగోళ్ళలో ఎక్కువ భాగాన్ని సమకూర్చుకోగలిగింది. అదానీ కంపెనీల్లో ఎల్‌ఐసి పెట్టుబడుల ద్వారానే దాదాపు రూ.80వేల కోట్ల నిధులు వచ్చాయి. బ్యాంకుల నుండి ఈ గ్రూపు తీసుకున్న అన్ని రుణాల్లో 40శాతం వరకు ఎస్‌బిఐ నుండే వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలడం వల్ల ప్రజల పొదుపు మొత్తాలకు, ప్రభుత్వ నిధులకు ముప్పు వాటిల్లుతోంది.

రూ.20వేల కోట్లను సమీకరించేందుకు అదానీ, బహిరంగంగా షేర్ల అమ్మకాలను ప్రారంభిస్తున్న సమయంలో సరిగ్గా హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడింది. అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలినప్పటికీ, అంతిమంగా ఆ ఆఫర్ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. దేశంలోని బడా పారిశ్రామికవేత్తలు కొందరు తమ సంస్థల తరపున కాకుండా వ్యక్తులుగా ఈ షేర్లను అధిక మొత్తంలో కొనుగోలు చేయడం వల్లే అవి పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. పెట్టుబడిదారుల మధ్య వర్గ సంఘీభావం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఈ ఉదంతం ఒక చక్కటి ఉదాహరణ. ముకేష్ అంబానీ, సజ్జన్ జిందాల్, సునీల్ మిట్టల్, పంకజ్ పటేల్ వంటి బడా వ్యాపారవేత్తలు అదానీ కంపెనీ షేర్లను పెద్ద మొత్తంలో కొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఆ మరుసటి రోజునే, అదానీ కంపెనీలు షేర్ల జారీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. పెట్టుబడిదారులందరికీ ఆ మొత్తాలను తిరిగి ఇచ్చేస్తామని కూడా చెప్పాయి. రెండు అదానీ ఫ్రంట్ కంపెనీలు మలి విడత పబ్లిక్ ఆఫర్‌లో పెట్టుబడులు పెట్టాయన్న ఆరోపణలు రావడంతో అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

అదానీ గ్రూపు అకస్మాత్తుగా, అందరి దృష్టిని ఆకర్షించేలా ఎదిగిన తీరు, చాలా వేగంగా విస్తరించిన వైనాన్ని ప్రశ్నించే స్థితే లేకుండా చేశారు. ఏళ్ళ తరబడి, గౌతమ్ అదానీ తన సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న తీరుపై అనేక తీవ్రమైన ప్రశ్నలు, ఆరోపణలు వచ్చాయి. బొగ్గు దిగుమతులకు అధిక మొత్తాలు చెల్లించినట్లు చూపించడం, తన కంపెనీలకు విదేశాల్లో నిధులు అందడంపై పారదర్శకత పాటించకపోవడం, పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించడం, నియమ నిబంధనలను తనకు అనుకూలంగా మలచుకుంటూ ప్రాజెక్టులను పొందిన తీరు పై మీడియాలో, వాణిజ్య విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతూనే వచ్చారు. కానీ, వీటిల్లో ఏ అంశంపైనా సెబి కానీ, ఆర్‌బిఐ కానీ, ఇడి వంటి ప్రభుత్వ నియంత్రణా సంస్థలు కానీ స్పందించిన దాఖలాలు లేవు.

తమ మోసపూరిత లావాదేవీలను ప్రశ్నించే జర్నలిస్టులను బెదిరించడానికి, అణచివేయడానికి అదానీలు తమ ధన, రాజకీయ బలాన్ని ఉపయోగించారు. అదానీల ఒప్పందాలకు ప్రశ్నించేలా కథనాలు రాసినా, ప్రసారం చేసినా సహించలేని స్థితి. ఆ కథనాలను ప్రచురించిన, లేదా ప్రసారం చేసిన వార్తా సంస్థలు, చానెళ్లపై పరువు నష్టం దావాలను ఒక అస్త్రంగా ప్రయోగించారు. ఉదాహరణకు, అదానీ ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌లో ఇండియన్ ఆయిల్ కంపెనీ, గెయిల్ ఇండియాలు పెట్టుబడులు ఎందుకు పెట్టాయని ప్రశ్నిస్తూ ఒక వార్తా కథనాన్ని ప్రచురించినందుకు 2017 నవంబరులో 'ది వైర్' పత్రికపై వంద కోట్లకు పరువు నష్టం దావా వేశారు. ఇటువంటి పరువు నష్టం కేసులను ఎదుర్కొంటున్న ఇతర జర్నలిస్టుల్లో పరంజయ్ గుహ థకుర్తా (ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ), రవి నాయర్ తదితరులున్నారు. ఈ విధంగా కేసులు పెట్టి మీడియా గొంతు నొక్కాలని అదానీ గ్రూపు ప్రయత్నించింది.

స్టాక్‌ల తారుమారు, మనీ లాండరింగ్, అకౌంటింగ్ మోసాలు, భారతదేశ అత్యున్నత పారిశ్రామికవేత్త పేరు ప్రతిష్టకు భంగం కలిగించే కుట్రగా చూపించే యత్నాలు, ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ అదానీ–హిండెన్‌బర్గ్ అధ్యాయం నుంచి తీసుకోవాల్సిన అసలు పాఠం మరుగున పడకూడదు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన దన్నుతోనే అదానీ భారతదేశంలోనే అత్యంత సంపన్నుడిగా ఎదిగిన వైనాన్ని చూడకపోతే అదానీ కథ అసంపూర్ణమే అవుతుంది. 2002లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినపుడు అదానీ, మోడీ మధ్య సంబంధాలు మొదలయ్యాయి. అప్పటి నుండి అదానీ అదృష్టాలన్నీ మోడీ రాజకీయ పంథాతో పెనవేసుకుని సాగాయి. 2014లో మోడీ ప్రధాని అయ్యారు. ఆ సంవత్సరంలో రూ.50.4 వేల కోట్లుగా వున్న అదానీ సంపద, 2022 నాటికి వచ్చేసరికి అమాంతంగా అది రూ.10.30లక్షల కోట్లకు పెరిగిపోయింది. మోడీకి అత్యంత ప్రీతిపాత్రుడైన పారిశ్రామికవేత్త అదానీకి ఇక పట్ట పగ్గాల్లేవు. ఏ ప్రభుత్వ నియంత్రణా సంస్థ కానీ, అధికారి కానీ ఆయనను ప్రశ్నించే సాహసం కానీ, అడ్డుకునే యత్నం కానీ చేయలేని స్థితి. ప్రభుత్వ అండ చూసుకునే అదానీ గ్రూపు తన వ్యాపార సామ్రాజ్యాన్ని అంతగా విస్తరించుకోగలిగింది. ఇటీవలి కాలంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి ఇదొక అత్యంత దారుణమైన ఉదాహరణ. మోడీ–అదానీ సంబంధాలు ఈనాడు దేశాన్ని పాలిస్తున్న హిందుత్వ–కార్పొరేట్ శక్తుల పొత్తును నగ్నంగా బయటపెట్టింది. మోడీ ప్రభుత్వ మద్దతుతో తాను ఈ తుపానును ఎదుర్కోగలనని అదానీ చాలా ధీమాగా ఉన్నారు. కానీ, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడాన్ని, మతోన్మాద–కార్పొరేట్ శక్తులు కుమ్మక్కయి తమ జీవనోపాధిని దెబ్బతీయడాన్ని స్వయంగా చూస్తున్న ఈ దేశ పౌరులకు మాత్రం ఈ దోపిడీ, అక్రమ సంపాదనలకు గాను అదానీలను జవాబుదారీ చేయడమనేది అత్యంత ముఖ్యమైన అంశంగా ఉన్నది.

అందువల్ల, అదానీ గ్రూపునకు సంబంధించిన మొత్తం ఆర్థిక, వ్యాపార కార్యకలాపాలన్నింటిపైనా నియంత్రణా సంస్థలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు దర్యాప్తు జరిపేలా చూసేందుకు కృతనిశ్చయంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా వుంది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ విచారణను సుప్రీం కోర్టు పర్యవేక్షించాలి.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

★

ఆ ఐదుగురు జడ్జిలను రెండు రోజుల్లో నియమిస్తాం

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు కొలిజియం సిఫార్సు చేసిన ఐదుగురు జడ్జిలను రెండు రోజుల్లోగా నియమిస్తామని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. రాజస్థాన్, పాట్నా, మణిపూర్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సంజయ్ కరూల్, జస్టిస్ పివి సంజయ్ కుమార్, పాట్నా, అలహాబాద్ హైకోర్టు జడ్జిలు అశానుద్దీన్ అమనుల్లా, మనోజ్ మిశ్రాలను సుప్రీంకోర్టుకు జడ్జిలుగా కొలిజియం సిఫార్సు చేయగా, రెండు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బిందాల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జనవరి 31న కొలిజియం సిఫార్సు చేసింది. ఆ సిఫార్సుల మేరకు బదిలీ, నియామకాలను పూర్తి చేయడానికి సుప్రీంకోర్టు కేంద్రానికి 10 రోజుల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

ఇజ్రాయిల్ దాడుల్లో 224 మంది పాలస్తీనియన్లు మృతి

జెరూసలెం : గతేడాది 224 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ సైన్యం చేతిలో మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో 53 మంది చిన్నారులు, 17 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొంది.

రెండున్నర లక్షల ఉద్యోగాలు

- వృద్ధులకు పెన్షన్
- ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఎలు
- ఒపిఎస్ పునరుద్ధరణ
- ఉపాధి హామీలో 200 రోజుల పని
- త్రిపుర అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసిన లెఫ్ట్ ఫ్రంట్


త్రిపుర అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తున్న నారాయణ్ కర్ తదితరులు

అగర్తలా : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే, 2.5 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పిస్తామని, నిరుపేదలైన వృద్ధులకు పింఛను ఇస్తామని హామీ ఇస్తూ సిపిఎం నేతృత్వంలోని వామపక్ష సంఘటన హామీ ఇచ్చింది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం 15పేజీల ఎన్నికల ప్రణాళికను వామపక్ష సంఘటన విడుదల చేసింది. పాత పెన్షన్ పథకాన్ని తిరిగి ప్రవేశపెడతామని, ఏటా ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఎలను పెంచుతామని కూడా హామీ ఇచ్చింది. తొలగించబడిన 10,323 మంది టీచర్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని, గిరిజన మండలికి మరింత స్వయంప్రతిపత్తి కల్పిస్తామని కూడా ఎన్నికల ప్రణాళిక వాగ్దానం చేసింది.

వామపక్ష సంఘటన కన్వీనర్ నారాయణ్ కర్ ఇక్కడ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, 2018లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత త్రిపురలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కివేసిందని విమర్శించారు. "బిజెపి - ఐపిఎఫ్‌టి ప్రభుత్వ హయాంలో ప్రజల ఓటింగ్ హక్కులు కాలరాయబడుతున్నాయి. తమ వాణిని వినిపించేందుకు ప్రజలకు గల స్వేచ్ఛ హరించివేయబడుతోందని అన్నారు. ఎన్నికల్లో వామపక్ష సంఘటన గెలుపొందితే తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరిస్తామని నారాయణ్ కర్ చెప్పారు. ఈ ఎన్నికల్లో వామపక్ష సంఘటనకు ప్రజలు పట్టం గడితే రాబోయే ఐదేళ్లలో రెండున్నర లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని వాగ్దానం చేశారు. మార్గదర్శకాల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను కూడా క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. 60ఏళ్లు దాటిన ఎవరికైనా, వార్షికాదాయం లక్ష లోపు వున్నట్లైతే, వారికి సామాజిక పెన్షన్ లభిస్తుందని కర్ తెలిపారు. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని ఏడాదికి రెండుసార్లు పెంచుతామని తెలిపారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. త్రిపురలో 1,88,494 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వున్నారు. 50 యూనిట్లలోపు వినియోగించే వారికి ఉచిత విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందించేందుకు ఉపాధి హామీ చట్టం కింద ఏడాదికి 200 రోజుల పని దినాలను కల్పిస్తామని వామపక్ష సంఘటన వాగ్దానం చేసింది. త్రిపుర గిరిజన స్వయంప్రతిపత్తి ప్రాంతాల జిల్లా మండలి (టిటిఎఎడిసి)కి ఉన్నత స్థాయి స్వయంప్రతిపత్తిని కల్పిస్తామన్నారు. అవినీతి రహిత, ప్రజానుకూల ప్రభుత్వాన్ని అందించడానికి లెఫ్ట్ ఫ్రంట్ కట్టుబడి వుందని ఆయన స్పష్టం చేశారు. 60స్థానాలున్న త్రిపుర అసెంబ్లీకి ఈ నెల 16న ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 2వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

కేరళ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

- పెరిగిన రాష్ట్ర ఆదాయం
- రెండంకెలకు వృద్ధిరేటు
- కొబ్బరి కనీస మద్దతు ధర పెంపు
- వ్యవసాయ రంగంలో స్టార్టప్‌ల కోసం రూ.1000 కోట్లు
- కేరళ బడ్జెట్‌ను సమర్పించిన ఆర్థిక మంత్రి బాలగోపాల్

తిరువనంతపురం : కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలతో ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ కేరళ సమగ్రాభివృద్ధికి అనుసరించే ప్రణాళికను ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ శుక్రవారం వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేరళ వార్షిక బడ్జెట్‌ను ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ, ప్రకృతి విపత్తులు, కరోనా వంటి మహమ్మారులు విసిరిన సవాళ్లన్నింటినీ సమర్ధవంతంగా ఎదుర్కొనగలిగామని చెప్పారు. అభివృద్ధి రేటు రెండంకెలకు చేరుకుందని, 2012 తర్వాత ఇదే అత్యధికమని అన్నారు. అన్ని అడ్డంకులను, అవరోధాలను ప్రభుత్వం దాటగలిగిందని చెప్పారు. దుర్భర దారిద్ర్యమనేది పూర్తిగా నిర్మూలించబడుతుందని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్వంత ఆదాయం పెరిగిందని, ఈ ఏడాది రూ.85 వేల కోట్లకు చేరుకుంటుందని చెప్పారు. రుణాల ఉచ్చులో రాష్ట్రం చిక్కుకోదని చెప్పారు. అవసరమైతే మరిన్ని రుణాలు తీసుకోవడానికి రాష్ట్రానికి ఇంకా అవకాశం వుందన్నారు. కేంద్రం అనుసరించే


ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్

ఘర్షణాయుత వైఖరే రాష్ట్రానికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం కేరళ మౌలిక సదుపాయాల పెట్టుబడుల నిధి బోర్డు (కెఐఐఎఫ్‌బి) ఇప్పటివరకు రూ.22,801 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న కెఐఐఎఫ్‌బిని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

ధరల పెరుగుదలను అరికట్టేందుకు రూ.2 వేల కోట్లు

ధరల పెరుగుదలను అరికట్టేందుకు రూ.2వేల కోట్లను కేటాయించామని చెప్పారు. రబ్బర్ సబ్సిడీకి రూ.600కోట్లు కేటాయించామన్నారు. రూ.1000 వరకు ధర వుండే లిక్కర్‌పై రూ.20ను సామాజిక భద్రతా సెస్‌గా విధించనున్నట్లు ప్రకటించారు. వెయ్యి రూపాయిల ధర దాటిన వాటిపై రూ.40 సెస్సు వుంటుందన్నారు. పెట్రోల్‌పై రూ.2ను సామాజిక భద్రతా సెస్‌గా విధిస్తున్నట్లు బాలగోపాల్ ప్రకటించారు. టెక్నో పార్క్‌లో కొత్త డిజిటల్ సైన్స్ విభాగం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో స్టార్టప్‌లను ప్రారంభించేందుకు గానూ మేక్ ఇన్ కేరళ ప్రాజెక్టు కోసం రూ.1000 కోట్లను కేటాయించినట్లు ప్రకటించారు. విజిళం రింగ్ రోడ్‌కు రూ.1000 కోట్లు, విజిళం పోర్టు ప్రాజెక్టుతో సంబంధమున్న అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.6 వేల కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. వ్యవసాయాభివృద్ధి కోసం రూ.971కోట్ల ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. కొబ్బరి కనీస మద్దతు ధరను మరో రూ.2 పెంచి, రూ.34గా ధరను నిర్ధారించారు. కేరళ ఆర్‌టిసికి రూ.3,400 కోట్లు కేటాయించారు.

సమాఖ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న కేంద్రం

ఆర్థిక సమాఖ్యవాద నిబంధనలను కేంద్రం ఉల్లంఘిస్తోందని బాలగోపాల్ విమర్శించారు. రెవిన్యూ లోటు గ్రాంట్లను కేంద్రం తగ్గించడం వల్ల కేరళ రూ.6,700 కోట్లు నష్టపోయిందన్నారు. జిఎస్‌టి నష్టపరిహారాన్ని వదులుకోవడం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.7వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఇలాంటి, అన్ని అడ్డంకులను, అవరోధాలను ప్రభుత్వం దాటగలిగిందని చెప్పారు.

కర్ణాటకలో అంగన్‌వాడీల విజయం

బెంగళూరు : కర్ణాటకలో అంగన్‌వాడీల ఆందోళనకు విజయం లభించింది. అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ గ్రాట్యుటీ చెల్లింపులు ఇవ్వడంతో సహా మూడు ప్రధాన డిమాండ్లను కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయం సాధించారు. తమ డిమాండ్ల సాధన కోసం జనవరి 23 నుండి వారు నిరవధికంగా ఆందోళన చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌కు నిర్దిష్ట కాలపరిమితి వేళలు (ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు) విధించడం, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పది పాసైన వర్కర్లకు, హెల్పర్లకు పదోన్నతులు వంటివి ప్రభుత్వం ఆమోదించిన ప్రధాన డిమాండ్లలో వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి రాతపూర్వక హామీ రావడంతో వారు తమ ఆందోళన విరమించారు. ఫ్రీడం పార్క్‌లో సిఐటియు పెద్ద ఎత్తున నిర్వహించిన నిరసన కార్యక్రమం కూడా అంగన్‌వాడీలు విజయం సాధించడానికి ఎంతగానో దోహదపడింది.కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన కొత్త విద్యా విధానం (ఎన్‌ఇపి) పట్ల అంగన్‌వాడీలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పిల్లల కోసం కొత్తగా ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. అదే గనుక జరిగితే అంగన్‌వాడీలు మూతబడతాయనే భయాం దోళనలు వారిలో వ్యక్తమవుతు న్నాయి. అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌కు నిర్దిష్టంగా కాలపరిమితిని ప్రభుత్వం విధించాలని సిఐటియు సూచించింది. వివిధ పథకాల కింద అంగన్‌వాడీ కార్యకర్తలకు పనులు అప్పచెబుతున్నారని, కానీ వారికి తగిన సాయం అందడం లేదని సిఐటియు పేర్కొంది. మినీ అంగన్‌వాడీల్లోని వర్కర్లు ఎవరైనా 12వ తరగతి పూర్తి చేసినట్లైతే వారికి పదోన్నతుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొన్నాయి. దానిపై వర్కర్లు ఆందోళన వెలిబుచ్చడంతో తర్వాత ఆ ఉత్తర్వులను సవరిస్తూ పది పాసైన వారికి కూడా ప్రాధాన్యత కల్పించేలా కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సీనియారిటీకి కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ చెల్లింపులను ఆమోదించినట్లు ఆర్థిక శాఖ నుండి సమాచారం వెలువడింది. 1975 నుండి అంగన్‌వాడీ కార్యకర్తలను పూర్తి స్థాయి ఉద్యోగులుగా గుర్తించడానికి తిరస్కరిస్తూ వారికి వేతనాలు బదులుగా గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. తమను టీచర్లుగా వర్గీకరించాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా వుంది. కానీ దాన్ని ప్రభుత్వం ఇంకా ఒప్పుకోలేదు.

సిపిఎస్ ఆందోళనపై నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

తదితరులను అరెస్టు చేశారు. వారిని వ్యక్తిగతపూచీతో సాయంత్రం విడుదల చేశారు.

సిపిఎం ఖండన

సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పెనమలూరు పోలీసు స్టేషన్‌లో అరెస్టయిన వారిని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు కలిసి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు పి మధు కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో ఉపాధ్యాయులను పరామర్శించారు.

దీక్షకు దిగిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులకు నిరసనగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు యుటిఎఫ్ రాష్ట్రకార్యాలయంలో సంకల్పదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్రప్రభుత్వ వైఖరి దుర్మార్గంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు రద్దుచేస్తామని రాష్ట్రప్రభుత్వం హామీనిచ్చి ఆ ఊసేఎత్తడం లేదని విమర్శించారు. ప్రభుత్వం దమనకాండను కొనసాగించినంత కాలం పోరాటం సాగితీరుతుందన్నారు. డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తీవ్రమైన అప్రజాస్వామిక వైఖరితో ఉందని విమర్శించారు. ఇలాంటి ధోరణి సరికాదన్నారు. సిపిఎస్, జిపిఎస్ వద్దని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.. ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాదయాత్రలో 'వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామ'న్న హామీ, కాంట్రాక్టు ఉద్యోగుల రద్దు, డిఎలు సకాలంలో చెల్లింపు మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శులు బి లక్ష్మిరాజా, ఎ కృష్ణసుందరరావు, వి మహేష్,ఎఎన్ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోండి : సిపిఎం, సిపిఐ డిమాండ్

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేపట్టిన సంకల్పదీక్షకు సిపిఎం, సిపిఐతో పాటు, ఎపిఎన్జీవో సంఘం మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుతో రాష్ట్రప్రభుత్వానికి ఆర్థికభారం ఉండదన్నారు. . సిపిఎస్‌పై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఓపిఎస్‌ను పునరుద్ధరిస్తేనే జగన్ ప్రభుత్వం ఉంటుందన్నారు. నూతన విద్యావిధానం (ఎన్ఇపి) ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని ఆదానీకి, విద్య రంగాన్ని బైజూస్‌కు, పాల పరిశ్రమను అమూల్ కంపెనీకి జగన్ అప్పగించారని పేర్కొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో ఐక్య ఉద్యమాలు వస్తాయని, అప్పుడు తప్పకుండా రద్దు చేయాల్సిందేనని తెలిపారు. సంకల్ప దీక్ష భవిష్యత్‌లో సమరదీక్షగా మారేందుకు పునాది పడిందని,ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే ఫలితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు భయపడు తోందని అన్నారు. సచివాలయం, సిఎం క్యాంపు కార్యాలయానికి గన్నవరం దూరంగా ఉన్నా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. పాధ్యాయులు ప్రభుత్వానికి గుణపాఠాలు చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. ఎపిఎన్జీవో సంఘం వెస్ట్‌కృష్ణా అధ్యక్షులు విద్యాసాగర్ దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్రనాయకులు జల్లివిల్సన్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారుల సొమ్ము భద్రం


ఎల్ఐసి ఉద్యోగ సంఘాల వెల్లడి

హైదరాబాద్ : పాలసీదారుల సొమ్ము చాలా భద్రంగా ఉందని ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో అదానీ గ్రూపు కంపెనీల షేర్లు తీవ్రంగా నష్టపోతున్న విషయం తెలిసిందే. వీటిలో ఎల్ఐసి పెట్టుబడులుగా పెట్టిన పాలసీదారుల సొమ్ము ప్రమాదంలో పడిందని రాజకీయ పార్టీలు, పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఫెడరేషన్ ఆఫ్ ఎల్ఐసి ఆఫ్ ఇండియా క్లాస్ వన్ ఆఫీసర్స్ అసోసియేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ), ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ), ఆల్ ఇండియా ఎల్ఐసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎల్ఇఎఫ్) సంఘాలు శుక్రవారం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. ఆ వివరాలు.. "హిండెన్‌బర్గ్ రిపోర్ట్ ఆరోపణలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలి. ఈ సమస్య వల్ల అదానీ గ్రూపు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన సంస్థలపై, కష్టపడి సంపాదించుకున్న లక్షలాది మంది భారతీయుల పొదుపుపై ప్రభావం పడింది. పార్లమెంట్ పరిశీలన, నియంత్రణ పర్యవేక్షణకు లోబడి ఎల్ఐసి ఎప్పుడూ పాలసీదారుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పెట్టుబడి నిర్ణయాలు చేస్తుంది. పెట్టుబడుల నిర్ణయాలపై బోర్డు క్షుణ్ణంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎల్ఐసి పెట్టుబడుల్లో 80 శాతం కూడా ప్రభుత్వ సెక్యూరిటీలు లేదా బాండ్ల లాంటి వాటిల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా పాలసీదారుల సొమ్ము చాలా సురక్షితంగానే ఉంటుంది. మిగిలిన 20 శాతం వరకు మాత్రమే ఈక్విటీల్లో పెట్టుబడులుగా పెడుతుంది. అదానీ కంపెనీల్లో నష్టాలు కేవలం కాల్పనికం. అదానీ గ్రూపు కంపెనీల్లో ఎల్ఐసి రూ.36,474.78 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. ప్రస్తుతం వీటి విలువ రూ.56,142 కోట్లుగా ఉందని జనవరి 30న ఎల్ఐసి ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో రూ.20,000 కోట్ల పైన లాభాల్లోనే ఉన్నట్టు. ప్రతీ ఏడాది ఎల్ఐసి వద్ద రూ.4.5 లక్షల కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మిగులు నిధులు ఉంటాయి. ఇందులో కొంత సొమ్మును బ్లూచిప్ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టి.. పాలసీదారులకు రిటర్న్‌లు ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. అదానీ, టాటా, రిలయన్స్, ఎల్ఐసి తదితర కంపెనీల స్టాక్స్‌లో పెట్టుబడులు ఉన్నాయి. ఆరు దశాబ్దాల రికార్డ్ కలిగిన ఎల్ఐసిలో పాలసీదారుల సొమ్ముకు ఎలాంటి డోకా లేదు. వారి డిపాజిట్లపై మంచి రిటర్న్‌లు ఇవ్వడమే సంస్థ లక్ష్యం." అని ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. అత్యంత ఉత్తమమైన ప్రభుత్వ రంగ విత్త సంస్థ ఎల్ఐసి కార్యాలయాల ముందు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఈ నెల 6న తలపెట్టిన ఆందోళనల పిలుపును ఆ పార్టీ వెనక్కి తీసుకోవాలని ఆయా సంఘాల ప్రతినిధులు ఎస్ రాజ్ కుమార్, వివేక్ సింగ్, శ్రీకాంత్ మిశ్రా, రాజేష్ కుమార్ కోరారు.

ఎల్ఐసి, బ్యాంకింగ్ రంగానికి ఇబ్బందేమీ లేదు : మంత్రి సీతారామన్

అదానీ గ్రూపు స్టాక్స్ పతనం నేపథ్యంలో ఆ కంపెనీలకు అప్పులిచ్చిన బ్యాంక్‌లు, ఎల్ఐసి సొమ్మునకు ఎవరు బాధ్యత వహిస్తార్న ప్రశ్నలపై గురువారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. అదానీ కంపెనీల్లో చాలా తక్కువ పెట్టుబడులే పెట్టినట్లు ఎస్‌బిఐ, ఎల్ఐసిలు పేర్కొన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆయా సంస్థల పెట్టుబడులు కంపెనీల్లో అనుమతించిన పరిధిలోనే ఉన్నాయన్నారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ చాలా పటిష్ఠంగా ఉందన్నారు. అదానీ షేర్ల పతనం బ్యాంకింగ్ రంగంపై ప్రభావం చూపబోదన్నారు.

ఎస్‌బిఐకి అదాని బకాయి రూ.27వేల కోట్లు



ముంబయి : అదాని కంపెనీలకు రూ.27వేల కోట్ల అప్పులు ఇచ్చినట్లు దేశంలోనే అతిపెద్ద రుణదాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వెల్లడించింది. ఇది అదాని మొత్తం రుణ పుస్తకంలో 0.88 శాతానికి సమానమని ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖార తెలిపారు. "పోర్టుల నుంచి గనుల రంగాల్లో వ్యాపారాలు కలిగిన అదానీ గ్రూపు షేర్లను తనఖాగా పెట్టుకుని రుణాలు ఇవ్వలేదు. ఇప్పటి వరకు ఆ కంపెనీల రుణాల చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు. స్పష్టమైన ఆస్తులు, తగిన నగదు లావాదేవీల ఆధారంగానే అప్పులిచ్చాం. మంచి రీపేమెంట్ రికార్డును కలిగి ఉంది. అదానీ గ్రూపు నుంచి ఎలాంటి రుణాల పునరుద్ధరణ ప్రతిపాదన రాలేదు." అని దినేష్ ఖార పేర్కొన్నారు.

రూ.10 లక్షల కోట్ల నష్టం

అధిక ధరలకు విద్యుత్‌ను విక్రయిస్తున్న అదానీ పవర్‌తో చేసుకున్న ఒప్పందంపై సవరణలు కోరుతామని బంగ్లాదేశ్ ప్రభుత్వ వర్గాలు చేసిన ప్రకటనతో ఆ కంపెనీ సూచీ 5 శాతం పడిపోయి రూ.192 వద్ద ముగిసింది. హిండెన్‌బర్గ్ నివేదిక, అంతర్జాతీయ విత్త సంస్థలు అదాని గ్రూపునపై ఆంక్షలు విధించడంతో ఆ కంపెనీల షేర్లు దిగజారుతున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఓ దశలో మరో 35 శాతం పతనమై రూ.1,017 కనిష్ట స్థాయిని తాకి.. అనంతరం కొనుగోళ్ల మద్దతుతో తుదకు 1.25 శాతం పెరిగి రూ.1,584 వద్ద ముగిసింది. అదానీ ట్రాన్స్‌మిషన్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 5 శాతం, అదానీ విల్మర్ 5 శాతం, ఎన్‌డి టివి 5 శాతం చొప్పున పతనమయ్యాయి. గత ఏడు సెషన్లలో అదానీ స్టాక్స్ రూ.10 లక్షల కోట్ల విలువను కోల్పోయారు. 10 స్టాక్స్ కూడా 51 శాతం మేర పతనం కావడంతో వాటి కాపిటలైజేషన్ రూ.9.31 లక్షల కోట్లు హరించుకుపోయింది.

21వ స్థానానికి అదానీ పతనం..

గతేడాది ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానంలో ఉన్న అదాని.. గత వారం రోజుల్లో పాతాళానికి పడిపోయారు. తాజాగా 61.3 బిలియన్ డాలర్ల సంపదతో 21వ స్థానానికి దిగజారరని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ సూచీ తెలిపింది. 57.6 బిలియన్ డాలర్ల సంపదతో అదాని 22వ స్థానానికి పడిపోయారని ఫోర్బ్స్ లిస్ట్ వెల్లడించింది.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఐదేళ్లలో 28,572 మంది రైతుల ఆత్మహత్య

- కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో గత ఐదేళ్లలో 28,572 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో 2017 నుంచి 2021 వరకు ఐదేళ్లలో 28,572 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎపిలో 2,413 మంది, తెలంగాణలో 3,055 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు.

రైల్వేలో 3,14,924 పోస్టులు ఖాళీ

రైల్వేలో 3,14,924 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రైల్వేలో 3,14,924 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులో 3,12,039 నాన్ గెజిటెడ్ పోస్టులు, 2,885 గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విజయవాడ డివిజన్‌లో 3,695, గుంతకల్లు డివిజన్‌లో 2,696, వాల్తేర్ డివిజన్‌లో 3,695, గుంటూరు డివిజన్‌లో 3,204, సికింద్రాబాద్ డివిజన్‌లో 3,218, హైదరాబాదులో 1,193 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

9,090 వెటర్నరీ డాక్టర్ల పోస్టులు ఖాళీ

దేశంలో 9,090 వెటర్నరీ డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో 2023 జనవరి 31 నాటికి 9,090 వెటర్నరీ డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 275, తెలంగాణలో 297 వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

విదేశీ జైళ్లలో 8,343 మంది

విదేశీ జైళ్లలో 8,343 మంది భారతీయులు మగ్గుతున్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి మురళీధరన్ తెలిపారు. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఎపిలో 1,82,375 నకిలీ రేషన్ కార్డులు

రాష్ట్రంలో 1,82,375 నకిలీ రేషన్ కార్డులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని కేంద్ర ప్రజా పంపిణీ, వినియోగదారుల వ్యవహారాలశాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. 2023 జనవరి 1 నాటికి తెలంగాణలో 77,874 నకిలీ రేషన్ కార్డులున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా 55,37,274 నకిలీ కార్డులున్నాయని తెలిపారు.

ఎపిలో 3,185 మంది చిన్నారులు అదృశ్యం

ఆంధ్రప్రదేశ్‌లో 3,185 మంది చిన్నారులు అదృశ్యమయ్యారని కేంద్ర శిశు సంక్షేమ, మహిళాశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2020 జనవరి 1 నుంచి 2022 డిసెంబరు 31 మధ్య దేశంలో 1,46,316 మంది చిన్నారులు అదృశ్యమయ్యారని, తెలంగాణలో 1,260 మంది అదృశ్యమయ్యారని తెలిపారు. చిన్నారుల అదృశ్యం కేసులు మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నాయి.

ఎపిలో 16,739 ఎకరాల రక్షణశాఖ భూమి


ఆంధ్రప్రదేశ్‌లో 16,739 ఎకరాల కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ భూమి ఉందని ఆ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 18,11,113 ఎకరాల భూమి రక్షణశాఖ పరిధిలో ఉందని, తెలంగాణలో 28,480 ఎకరాల భూమి ఉందని తెలిపారు.

మతమార్పిడి నిరోధక చట్టంపై ఐదు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : వివాదాస్పద 'మతమార్పిడి నిరోధక' చట్టాలు తీసుకొచ్చిన ఐదు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇందులో ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాలు ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఈ విషయంలో ఇప్పటికే నోటీసులు జారీ అయిన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా మానవ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్ ద్వారా నడుపబడుతున్న సిటిజెన్స్ ఫర్ పీస్ (సిపిజె) స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జిఒ) ఉన్నది. పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వొకేటు సి.యు. సింగ్ వాదించనున్నారు.ఈ చట్టాలకు వ్యతిరేకంగా 2019 డిసెంబర్‌లోనే పిటిషన్ దాఖలైంది. అప్పటి నుంచి రెండు రాష్ట్రాలు ఆర్డినెన్సులను, చట్టాలనూ తీసుకొచ్చాయి. ఐదు రాష్ట్రాలు అలాంటి చట్టాలను తీసుకొచ్చాయి. దీంతో సిపిజె కూడా తన పిటిషన్‌లో మార్పులు చేస్తూ సదరు రాష్ట్రాలు తీసుకొచ్చిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగా కొత్త పిటిషన్‌ను వేసింది. ఈ చట్టాలపై దాఖలైన పిటిషన్లపై విచారణకు గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. 'లవ్ జీహాద్' సాకుతో దేశంలోని పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిములే లక్ష్యంగా కొత్త 'మత స్వేచ్ఛ' చట్టాలను తీసుకొచ్చాయి.

పాక్ డ్రోన్ కూల్చివేత

అమృత్‌సర్ : మూడు కిలోల హెరాయిన్‌తో భారత భూభాగంలోకి వస్తున్న ఒక పాకిస్థాన్ డ్రోన్‌ను సరిహద్దు భద్రతా సిబ్బంది (బిఎస్ఎఫ్) దళాలు శుక్రవారం తెల్లవారుజామున పంజాబ్ సరిహద్దుల్లోని అమృత్‌సర్ రీర్ కక్కర్ పోస్ట్ వద్ద కూల్చివేశాయి.



వెండితెర యశస్వి

సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు కనిపించే ఆయన సినిమాల్లో కులాంతర వివాహాలు, అంటరానితనం, వితంతువు పెళ్లి, వరకట్నం వంటి సామాజిక రుగ్మతలపై చర్చ కనిపిస్తుంది. కథ, కథనం కంటే హీరో.. హీరోయిజానికే పెద్ద పీట వేస్తున్న రోజుల్లో అమాయకుడు, అందవిహీనుడు, అంధులు, మూగ, చెవిటి బాధితులు, చెప్పులు కుట్టేవాడు, రంగులు వేసుకునేవాడు, గంగిరెద్దుల వాళ్లు, మత్స్యకారుడు.. ఆయన కథల్లో ప్రముఖంగా కనిపిస్తారు. అందుకే ఆయన గొప్ప కథకుడిగానే కాదు.. కళలకు ప్రాణమిచ్చిన వ్యక్తిగానూ అభిమానుల గుండెల్లో నిలిచిపోయారు. కళాతపస్విగా చెరగని ముద్రవేసుకున్నారు. గురువారం రాత్రి తన జీవన ప్రస్థానం ముగించిన కె విశ్వనాథ్ సినీ ప్రయాణం సౌండ్ ఇంజినీర్‌గా మొదలైంది. 'ఆత్మ గౌరవం' సినిమాతో దర్శకుడిగా మారిన ఆయన చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక ఒరవడిని సృష్టించుకున్నారు. ఆయన సినిమాలో పనిచేయడమే గొప్ప వరంగా నటులు భావించే స్థాయికి ఎదిగారు.

సాంప్రదాయ పునాదికి సామాజిక అంశాలను జోడిస్తూ సినిమాలు తీయడం విశ్వనాథ్ వరవడి. ఆయన తన కెరియర్‌లో 50కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. దాదాపు 30 సినిమాల్లో నటించారు. కమల్ హాసన్, ఆమని ప్రధాన తారాగణంగా నటించిన 'శుభ సంకల్పం' సినిమాలో రాయుడు పాత్రలో ఆయన తొలిసారి తెరపై కనిపించారు. 'ఆ సినిమా నిర్మాత ఎస్‌బి బాలసుబ్రమణ్యం రాయుడు పాత్రలో తననే ఊహించుకున్నానని చెప్పడం, అందుకు ఒప్పుకోకపోతే అక్కడి నుంచి అలిగి వెళ్లిపోయినట్లు' ఆనాటి సంఘటనను ఓ సందర్భంలో గుర్తుచేసుకున్నారు. ఎస్‌పి బాలు సంకల్పానికి కమల్‌హాసన్ చొరవ తోడై ఎట్టకేలకు విశ్వనాథ్ రాయుడు పాత్రలో నటించేందుకు ఒప్పుకున్నారు. ఎంతో బలమైన పాత్రలో అంతే హుందాగా నటించారు విశ్వనాథ్. ఆ తరువాత ఎన్నో పాత్రల్లో తాత, తండ్రిగా తెరపై కనిపించి గంభీరం, హాస్య రసాలను పలికించారు. 'ధ్రువ' సినిమాలో విలన్ పాత్రలో కూడా మెరిశారు.

ఖాకీ దుస్తులే ధరించేవారు..

కొంతమంది సీనియర్ దర్శకులు సెట్‌లో ఒక్కో పద్ధతిని, ఆహార్యాన్ని పాటించేవారు. విశ్వనాథ్ ఖాకీ దుస్తులు ధరించి సెట్‌లో అడుగుపెట్టేవారు. దర్శకత్వ బాధ్యతల నుండి రిటైర్‌మెంట్ తీసుకున్నా ఆ దుస్తులను ఎంతో భద్రంగా దాచుకున్నారు. 'సౌండ్ రికార్డిస్ట్‌గా ఉండి దర్శకుణ్ణి అయినవాణ్ణి. ఈ కారణాలతో తల బిరుసు రావడానికి అవకాశాలు ఎక్కువ. దర్శకుణ్ణి అయిపోగానే తెల్ల ప్యాంట్, తెల్ల చొక్కా, తెల్ల బూట్లు, మెడలో గొలుసులు వేసుకుని హడావిడి చేయడం నాకు ఇష్టం ఉండదు. అందరిలా మామూలు మనిషిలా ఉండాలనుకున్నా. అందుకే నిజాయతీగా ఓ ప్రయత్నం చేశా. నా సెట్లో పనిచేసే పెయింటర్స్, లైట్‌బాయ్స్, హెల్పర్స్.. అందరికీ ఖాకీ దుస్తులే ఇచ్చి ధరించమనేవాణ్ణి. కాకపోతే వాళ్లకు నిక్కరు, నాకు ప్యాంటు అంతే తేడా. 'మీరు ఖాకీ డ్రస్సు వేసుకోవడం ఏమిటండీ..' అని మా ఆర్ట్ డైరెక్టర్ తెగ గొడవ పడేవాడు. 'సినిమాల్లో ఫెయిలైతే వెంటనే టాక్సీ డ్రైవరుగా మారిపోతా. అప్పుడు కుట్టించుకోవడానికి వీలుంటుందో లేదో.. ఓ జత రెడీ ఉన్నట్టుంటుంది' అని చెప్పానని ఓ ఇంటర్వ్యూలో నవ్వుతూ గుర్తుచేసుకున్నారు.

వృత్తి కళాకారుల ఆణిముత్యాలు

విశ్వనాథ్ చిత్రాల్లో వృత్తి కళలకు పెద్దపీట వేసేవారు. హీరో ఇమేజ్‌ను బట్టి సినిమాలు తీసే రోజుల్లోనే 'స్వయం కృషి' సినిమాలో చిరంజీవిని చెప్పులు కుట్టేవాడిగా చూపించిన సాహసం ఆయనది. 'స్వర్ణ కమలం'లో వెంకటేష్ రంగులు వేసే కళాకారుడిగా కనిపిస్తారు. 'సూత్రధారులు' చిత్రంలో నాగేశ్వరరావు, మురళీమోహన్ గంగిరెద్దులు ఆడించేవారిగా నటిస్తారు. 'శుభ సంకల్పం'లో కమల్‌హాసన్ మత్స్యకారుడిగా అలరిస్తారు. వీటన్నింటికంటే ముందే 'సిరిసిరి మువ్వ'లో డప్పు వాయిద్యగాడిగా చంద్రమోహన్‌ను చూపించారు. ఇలా అనేక చిత్రాల్లో వృత్తి కళాకారులుగా ఆయన సినిమాల్లో ప్రధాన తారాగణం కనిపిస్తారు.

సంగీత నృత్యాలే ప్రధాన పాత్రలు

కమల్ హాసన్, జయప్రదతో తెరకెక్కించిన 'సాగర సంగమం' చిత్రం గొప్ప కళాఖండం. వంటలు చేసుకునే తల్లి కొడుకు గొప్ప నృత్యకారుడిగా ఎదిగే క్రమంలో వచ్చే ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ఆయన 'శంకరాభరణం' తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రభంజనం. చిన్న చిన్న పాత్రలు వేస్తున్న సోమయాజులుతో ఓ కళాఖండమే సృష్టించారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రాధాన్యం ఇచ్చే సంగీత విద్వాంసుడి పాత్రలో సోమాయాజులను గంభీరంగా చూపిస్తూనే నృత్య కళాకారిణి మంజుభార్గవిని విభిన్న పాత్రలో నటింపజేసి ఆ పాత్రలో గొప్ప ఔన్నత్యాన్ని చూపించారు. 'స్వాతి కిరణం'లో శిష్యుడి ప్రతిభను అంగీకరించలేని గురువుగా మమ్ముట్టి పాత్ర సగటు మనిషి తత్వానికి అద్దం పడుతుంది. ఇక 'శృతి లయలు' 'స్వరాభిషేకం' చిత్రాలు ఆణిముత్యాలుగా నిలిచిపోతాయి.


సామాజిక అంశాలు..

'స్వాతి ముత్యం' సినిమాలో అమాయక పాత్రలో నటించిన కమల్ హాసన్ నటన ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా ఉండిపోతుంది. ఆ సినిమాలో వితంతువు పెళ్లి చేసుకొని కొత్త జీవితం ప్రారంభించవచ్చని చూపించారు. 'సప్తపది' చిత్రంలో కులవివక్షను ఎత్తిచూపారు. వీటన్నింటి కంటే ముందే అందాల నటుడిగా స్క్రీన్‌పై కనిపించే శోభన్ బాబును అందవిహీనంగా చూపిస్తూ 'చెల్లెలు కాపురం' తెరకెక్కించారు. బాహ్య సౌందర్యానికి, అంత: సౌందర్యానికి సమాజంలో ఇచ్చే ప్రాధాన్యత ఆ సినిమాలో కనపడుతుంది. 'సిరివెన్నెల' చిత్రంలో మురళి వాయిద్యగాడిగా చెవిటి పాత్రలో హీరో కనిపిస్తారు. ఆయనను ఆరాధించే పాత్రలో సుహాసిని మూగ, చెవిటి పాత్రలో కనిపిస్తుంది. 'సిరి సిరి మువ్వ' చిత్రంలో డప్పు వాయించే వాడిగా చంద్రమోహన్, నాట్యంపై మక్కువ చూపించే మూగ అమ్మాయిగా జయప్రద కనిపిస్తారు. 'శుభలేఖ' చిత్రంలో వరకట్న సమస్యకు బలయ్యే ఆడపిల్లల కుటుంబాలను ఎంతో హృద్యంగా చూపిస్తారు. సున్నితమైన హాస్యాన్ని పండించడం, హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ చిగురించే సందర్భాలను ఎంతో హుందాగా తెరకెక్కించడంలో కూడా విశ్వనాథ్ గొప్ప నేర్పరి.

ఆ చిత్రాలే ఇంటి పేర్లుగా..

'శుభలేఖ' చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమైన సుధాకర్‌కు ఆ సినిమానే తన ఇంటిపేరుగా మారిపోయింది. 'సిరివెన్నెల' చిత్రంతో పరిచయమైన సీతారామశాస్త్రికి ఆ పేరే చిరస్థాయిగా నిలిచిపోయింది. సినిమాలే కాదు ఆయా పాత్రల్లో నటించిన నటులు కూడా ఆ పాత్రల పేరుతోనే పిలవబడేవారు. ఉదాహరణకు 'శంకరాభరణం' తరువాత సోమయాజులను అందరూ శంకరశాస్త్రి అని పిలిచేవారంట. హిందీ చిత్రసీమలోనూ తనదైన ముద్రవేసిన విశ్వనాథ్ పదికిపైగా చిత్రాలను బాలీవుడ్‌లో తెరకెక్కించారు. జయప్రద ఆయన చిత్రంతోనే బాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమయ్యారు.

బుర్రకథ, హరికథ, తప్పెటగుళ్లు, మురళి వాయిద్యం, నాట్యం, సంగీతం వంటి కళలు, ఆయా కళలనే నమ్ముకున్న కళాకారులు ఆయన చిత్రాల ప్రధాన ఇతివృత్తాలు. కళను, కళాకారులను ప్రేమించడమే కాక, సనాతన సాంప్రదాయాల మాటున నలిగిపోయే సగటు మనిషి జీవితాలను గొప్ప దృశ్యకావ్యాలుగా మలిచిన కె.విశ్వనాథ్ తెలుగు చిత్రసీమ వర్ధిల్లినంతకాలం అజరామరంగా వెలుగొందుతూనే ఉంటారు.




కళాతపస్వి కె విశ్వనాథ్ పూర్తి పేరు కాశీనాథుని విశ్వనాథ్. గుంటూరు జిల్లా పెదపులిపర్రులో కాశీనాథుని సుబ్రమణ్యం, సరస్వతమ్మలకు 1930 ఫిబ్రవరి 19న జన్మించారు. సౌండ్ ఇంజినీరుగా చిత్రసీమలో అడుగుపెట్టిన ఆయన 1965 నాటికి 'ఆత్మ గౌరవం' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, కమల్‌హాసన్, చంద్రమోహన్, మురళీమోహన్ వంటి ఎందరో నటులు ఆయన సినిమాలో నటించారు.



కళాతపస్వి కె.విశ్వనాథ్ తెరకెక్కించిన ప్రతి సినిమాకు అవార్డులు వచ్చాయి. తొలి సినిమా 'ఆత్మగౌరవం'కు నంది అవార్డు వచ్చింది. శంకరాభరణం చిత్రానికి నాలుగు జాతీయ అవార్డులు వచ్చాయి. సప్తపది చిత్రానికి 'నర్గీస్‌దత్త్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్' అవార్డు వరించింది. స్వాతిముత్యం, సూత్రధారులు, స్వరాభిషేకం చిత్రాలకు ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌లుగా జాతీయ అవార్డులు వచ్చాయి. ఆస్కార్‌కు నామినేట్ అయిన తొలి తెలుగుచిత్రంగా 'స్వాతిముత్యం' నిలిచింది.

ప్రతి చిత్రం.. ప్రతిష్టాత్మకం ...

మధురమైన పాటలతో ...



మరపురాని సినిమాలు తీసిన వాటిలో ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన పాటలు ఎన్నో ఉన్నాయి. సీతా మహాలక్ష్మి సినిమాలో 'మావిచిగురు తినగానే', స్వాతిముత్యంలో 'సువ్విసువ్వి సువ్వాలమ్మా..' 'మౌనమేలనోయి.. ఈ మరపురాని రేయి', సాగర సంగమంలో 'తకిట తదిమి..', శుభసంకల్పంలో 'సీతమ్మ అందాలు రామయ్య గోత్రాలు..', 'నీలాల కన్నుల్లో సంద్రమే..', స్వర్ణకమలంలో 'ఘల్లు ఘల్లు మంటు..' వంటి పాటలు మళ్లీ మళ్లీ వినాలిపించేవిలా మనసుకు హత్తుకున్నట్లుంటాయి. చిరంజీవి నటించిన స్వయంకృషిలో 'పారాహుషార్..', ఆపద్బాంధవుడు చిత్రంలో 'ఔరా అమ్మకుచల్లా..' ఆల్‌టైమ్ హిట్స్‌గా నిలుస్తాయి. సిరివెన్నెల, 'విధాత తలపున ప్రభవించినది' స్వాతికిరణంలో ప్రతి పాటా ప్రేక్షకుల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచి ఉంటాయి.

సినీ ప్రముఖుల నివాళి



కె విశ్వనాథ్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని తెలియజేశారు. దర్శకులు రాంగోపాల్ వర్మ, క్రిష్, మాధుర్ భండార్కర్, రాకేశ్ రోషన్, యాక్టర్లు చిరంజీవి, కమల్‌హాసన్, అనిల్ కపూర్, మహేశ్ బాబు, రామ్ పోతినేనితోపాటు విక్రమ్, మోహన్ లాల్, మమ్ముట్టి, సాయిపల్లవి తమ సంతాపం తెలియజేశారు.

విశ్వనాథ్.. తెలుగు దర్శకుడే కాదు, భారతీయ దర్శకుడు కూడా. యువతరానికి ఆయన ఆదర్శం. సినీ పరిశ్రమ పెద్దదిక్కును కోల్పోయింది. **- నాజర్**

'విశ్వనాథ్.. సమాజానికి ఉపయోగపడే గొప్ప చిత్రాలు తీశారు. బాపు, బాలచంద్ర, విశ్వనాథ్ వంటి వారు చరిత్రకారులు **- రాఘవేంద్రరావు**

ప్రపంచంలో ఎవ్వరైనా మీ తెలుగు సినిమా గొప్పదనం ఏంటి అని అడిగితే.. మాకు కె.విశ్వనాథ్ గారు ఉన్నారని రొమ్ము విరిచి గర్వంగా చెప్పుకుంటాం. తెలుగు చిత్ర పరిశ్రమ మిమ్మల్ని ఎప్పటి మర్చిపోలేదు. సినిమా గ్రామర్‌లో మీరు నేర్పిన పాత్రలకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం. **- ఎస్ఎస్ రాజమౌళి**



భారతదేశంలో అత్యంత ప్రభావశీలుడైన రైటర్ కమ్ డైరెక్టర్ అయిన కె.విశ్వనాథ్. ఆయన సినిమాలు చిరకాలం గుర్తుండిపోతాయి. **- రాంగోపాల్ వర్మ**

నేను ఎంతగానో అభిమానించే గొప్ప దర్శకుల్లో విశ్వనాథ్ ఒకరు. ఆయన ప్రతి నటుడికి గురువు లాంటి వారు. ఆణిముత్యాల్లాంటి సినిమాలతో చిరస్థాయిగా గుర్తుండిపోతారు. **- అల్లు అర్జున్**




'బాల' పెన్ను కథ

బాల్‌పెన్ అంటే బాలలకి ఎంతో ఇష్టం
పెన్సిల్ నుండి పెన్నుకి మారడం
ఏనుగెక్కినంత సంబరం...
బాల్‌పెన్నుకి
ఉలి, ఘంటం ముత్తాతలు
శాసనాలు, కావ్యాలు వీటి సృష్టే!
బాల్‌పెన్నుకి పక్షి ఈక తాతగారు
ఎన్నో కవితలు, కథలు, చిత్రాలు దీని చలువే
బాల్‌పెన్నుకి ఫౌంటెన్ పెన్ను నాన్న
నోట్సు, పరీక్షలు రాయడానికే కాదు
ఇంకా అల్లరి పిల్లలు తోటి వాళ్లపై
ఇంకు చల్లడానికి కూడా ఇది సై!
ఇక బాల్‌పెన్ను పుట్టుకకి
రెండో ప్రపంచయుద్ధం కారణం
...ఆశ్చర్యంగా వుందా?
అయినా ఇది నిజం...
యుద్ధంలో విమానాలు గగనంలో దూసకుపోతున్న తరుణాన
పైమెట్ల జేబుల్లోని పెన్నుల నుండి
గాలి పీడనకి ఇంకు పైకి ఉరికి
జేబుల నిండా ఇయే మరకలు..
అప్పుడు కారని పెన్నులు కావాల్సి వచ్చింది
అలా బాల్ పెన్నులు కన్ను తెరిచాయి
ఎప్పుడైనా అవసరమే కదా
అన్వేషణకి జనని
ఏమైనా నేటి బాలల చదువుకు
బాల్‌పెన్ను వెన్నుదన్ను!



- ఎస్. హనుమంతరావు
88978 15656



దారి చూపండి

చిన్నారులూ,
రవి కారులో పెట్రోల్
అయిపోయింది.
బంకుకు వెళ్లే దారి చూపి
సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- నిఖిత బీసాయి,
3వ తరగతి,
మండల పరిషత్ ప్రాథమిక
పాఠశాల, బొరివంక, కవిటి,
శ్రీకాకుళం జిల్లా.









ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతున్న టీమిండియా ఆటగాళ్లు



9నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ● తొలి టెస్టుకు నాగపూర్ సిద్ధం

ముంబయి: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తలపడేందుకు భారత్-ఆస్ట్రేలియా జట్లు సిద్ధమౌతున్నాయి. ఈ క్రమంలో 9నుంచి నాగ్ పూర్ వేదికగా జరిగే తొలిటెస్ట్‌కోసం టీమిండియా ఆటగాళ్లు శుక్రవారం నెట్స్‌లో చెమటోడ్చి ప్రాక్టీస్ చేశారు. కొంతకాలం గాయంతో జట్టుకు దూరంగా ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా శుక్రవారం ఆటగాళ్లతో కలిసి బ్యాటింగ్ ప్రాక్టీసు చేస్తూ కనిపించాడు. టీమిండియా ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలను బిసిసిఐ శుక్రవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. స్వదేశంలో ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టి20, వన్డే సిరీస్‌లను చేజిక్కించుకున్న టీమిండియా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌కు సీనియర్ ఆటగాళ్లు అందుబాటులోకి వచ్చారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతోపాటు, రవీంద్ర జడేజా, శిఖర్ ధావన్ తదితరులు నెట్స్‌లో సాధన చేస్తూ కనిపించారు. ఆస్ట్రేలియాతో 4టెస్టుల సిరీస్ ఈ నెల 9న ప్రారంభం కానుంది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు బెంగళూరులోని ఆలూర్ క్రికెట్ స్టేడియంలో ప్రాక్టీసు చేస్తోంది. ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం ఆసీస్ అగ్రస్థానంలో ఉండగా, టీమిండియా రెండో స్థానంలో కొనసాగుతోంది. రెండు అగ్రశ్రేణి జట్లు తలపడుతున్న సిరీస్ కావడంతో అందరి దృష్టి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీపైనే ఉంది.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

ఫిబ్రవరి 9-13 :	తొలిటెస్ట్	నాగ్‌పూర్
ఫిబ్రవరి 17-21 :	రెండోటెస్ట్	ఢిల్లీ
మార్చి 1 - 5 :	మూడోటెస్ట్	ధర్మశాల
మార్చి 9 - 13 :	నాల్గోటెస్ట్	అహ్మదాబాద్

వన్డే సిరీస్..

మార్చి 17 :	తొలి వన్డే	ముంబయి
మార్చి 19 :	రెండో వన్డే	విశాఖ
మార్చి 22 :	మూడో వన్డే	చెన్నై



సాయి ప్రణీత్ ఓటమి

థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన ఏకైక షట్లర్ సాయి ప్రణీత్ పరాజయాన్ని చవిచూశాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోటీలో సాయి ప్రణీత్ 17-21, 23-21, 18-21తో షీ-ఫెంగ్ లీ(చైనా) చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్‌ను చేజార్చుకున్న సాయి ప్రణీత్.. రెండో గేమ్‌లో హోరాహోరీ పోరులో నెగ్గాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సాయి ప్రణీత్ పోరాడినా చివరి వరకు పోరాడి 18-21తో ఆ గేమ్‌ను ఓడాడు.

ఆంధ్రకు తప్పని ఓటమి

● యశ్ దూబే, రజత్ పాటిదార్ అర్ధసెంచరీలు
● సెమీస్‌కు మధ్యప్రదేశ్



ఇండోర్: డిఫెండింగ్ ఛాంపియన్ మధ్యప్రదేశ్‌జట్టు రంజీట్రోఫీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్‌ఫైనల్లో మధ్యప్రదేశ్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ఆంధ్రాపై విజయం సాధించింది. ఓపెనర్ యశ్ దూబే, రజత్ పాటిదార్ అర్ధ సెంచరీలతో రాణించారు. 245పరుగులు ఛేదనలో భాగంగా ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టపోకుండా 58 పరుగులతో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ జట్టు 77ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శుభమ్ శర్మ(40), శరన్స్ జైన్(28) కూడా బ్యాటింగ్‌లో రాణించారు. లలిత్, పృథ్వీ రాజ్‌కు రెండేసి, నితీశ్ కుమార్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పృథ్వీ రాజ్‌కు లభించింది. ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో కర్ణాటక జట్టు 281పరుగుల తేడాతో ఉత్తరాఖండ్‌పై, బెంగాల్ జట్టు 9వికెట్ల తేడాతో జార్ఖండ్‌పై గెలిచి సెమీస్‌కు చేరాయి. ఇక సౌరాష్ట్ర-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న మరో క్వార్టర్‌ఫైనల్లో పంజాబ్ జట్టు శనివారం 97ఓవర్లలో 200పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. ఇక మధ్యప్రదేశ్ సెమీఫైనల్లో బెంగాల్ జట్టుతో అమీతుమీకి సిద్ధమైంది. ఫిబ్రవరి 8న సెమీస్ పోరు జరగనుంది.

క్రికెట్‌కు జోగిందర్ శర్మ గుడ్‌బై



ఛండీగఢ్: టీమిండియా 2007లో టీ20 ప్రపంచకప్ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన జోగిందర్ శర్మ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. ఆల్ ఫార్మాట్ క్రికెట్‌నుంచి వైదొలుగుతున్న విషయాన్ని సోషల్ మీడియా వేదికగా శుక్రవారం వెల్లడించాడు. 2004లో జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్న జోగిందర్.. టీమిండియా తరపున కేవలం నాలుగు వన్డేలు, మరో నాలుగు టి20లను మాత్రమే ఆడాడు. 2007లో పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచే అతడి చివరి టి20 కావడం గమనార్హం. 2008 నుంచి 2012 వరకు ఐపిఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన జోగిందర్‌కు.. జాతీయ జట్టు తరపున అవకాశాలు రాలేదు. 2007లో హర్యానా పోలీస్ శాఖలో ఉద్యోగంలో చేరిన జోగిందర్.. నేడు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68